1 St
Happy Work Anniversary.
Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 214 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 01 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 214 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 01 July 2025 PAGES : 8 PRICE : 3/-

# అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీగా మారుస్తాం



**అమరావతి క్వాంటమ్ వ్యాలీ ద్వారా వచ్చే ఐదేళ్లలో లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

**50కి పైగా యూనికార్న్‌ల అభివృద్ధి**

**చంద్రబాబు సాంకేతిక విప్లవంలో సెకండ్ చాప్టర్**

**క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ**

**అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్ లో మంత్రి నారా లోకేశ్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 30)

సీఎం చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ అని, ప్రజారాజధాని అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్ లో నిర్వహించిన అమరావతి క్యాంటమ్ వ్యాలీ వర్క్ షాప్ లో సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా -మిగతా 2లో



## జులై 8 కంటే ముందే భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ప్రకటన..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 30)

భారత్-అమెరికాల మధ్య వాణిజ్యఒప్పందంపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కీలక ప్రకటన జులై 8 కంటే ముందే వెలువడవచ్చని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ చర్చలకు నాయకత్వం వహిస్తున్న వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌లో ఉండి తుదివిడత సంప్రదింపులు మొదలుపెట్టారు. ఇప్పటికే ట్రంప్ విధించిన టారిఫ్‌ల సస్పెన్షన్ జులై 9వ తేదీ వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. ఎందుకంటే ఈ డెడ్‌లైన్‌ను మరోసారి పొడిగించే ఉద్దేశం తనకు లేదని అమెరికా అధ్యక్షుడు ఫాక్స్ న్యూస్‌కు వెల్లడించారు. అతిత్వరలోనే టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ట్రంప్ భారత్ నుంచి చేసుకొనే దిగుమతులపై విధించిన 26 శాతం టారిఫ్‌లు జులై 9 వరకు అమల్లోకి రావు. ఇక బేస్‌లైన్ టారిఫ్ 10శాతం మాత్రం వర్తిస్తోంది. ఈ చర్చల సందర్భంగా భారత్ 26శాతం పన్నుపై రాయితీ కోరుతోంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, ఆటోమొబైల్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటెన్సివ్ ప్రొడక్ట్‌ల పైనే దృష్టిపెట్టింది. ముఖ్యంగా వ్యవసాయం, డెయిరీ రంగాల విషయంలో ఇరుదేశాల మధ్య చిక్కుముడులు నెలకొన్నాయి. భారత్ పాల ఉత్పత్తుల మార్కెట్‌ను విదేశీ సంస్థల కోసం తెరిచేందుకు సిద్ధంగా లేదు. మరోవైపు అమెరికా కొన్నిరకాల ఇండస్ట్రియల్ గూడ్స్‌కు, ఆటోమొబైల్ -మిగతా 2లో

## అంతరిక్షంలో భారత్ నిఘా నేత్రం 52 మిలిటరీ ఉపగ్రహాల ప్రయోగం వేగవంతం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 30)

'ఆపరేషన్ సిందూర్' తర్వాత అంతరిక్షంలో నిఘాను భారత్ మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా చైనా, పాకిస్థాన్, హిందూ మహాసముద్రంపై నిఘా పెట్టేందుకు వీలుగా 52 మిలిటరీ ఉపగ్రహాలను ప్రయోగించాలని నిర్ణయించింది. రియల్ టైమ్ మానిటరింగ్ తదితర అవసరాల కోసం రూ.26,968 కోట్లను వెచ్చించనుంది. ఓ వైపు చైనా శరవేగంతో అంతరిక్షంలో ఆధిపత్యం కోసం యత్నిస్తున్న నేపథ్యంలో భారత్ ఈ చర్యలు చేపట్టింది. స్పేస్ బేస్ సర్వైలెన్స్ ఎస్‌బీఎస్ మూడోవిడత కార్యక్రమంలో భాగంగా.. ఇస్రో 21 ఉపగ్రహాలను ప్రయోగించనుంది. మిగిలిన 31 శాటిలైట్స్‌ను మూడు ప్రైవేటుసంస్థలు అభివృద్ధి చేసి కక్ష్యలోకి చేర్చనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి ఉపగ్రహాన్ని ఏప్రిల్ -మిగతా 2లో



## 'ఆపరేషన్ సిందూర్'.. రక్షణ అధికారి వ్యాఖ్యల ఉద్దేశం అది కాదు: భారత ఎంబసీ వివరణ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 30)

పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' పేరిట దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే, తమకు 'ఆపరేషన్ సింధూర్' సమయంలో అడ్డంకులు ఎదురయ్యాయని.. దీని వల్ల కొన్ని విమానాలను కోల్పోవాల్సి వచ్చిందని భారత రక్షణ అధికారి కెప్టెన్ శివకుమార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. వీటిపై అధికార భాజపా, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. జూన్ 10న ఇండోనేషియా వేదికగా జరిగిన సెమినార్ శివకుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. తాజాగా జకార్తాలోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చింది. "భారత రక్షణ అధికారి ఓ సెమినార్ ప్రెజెంటేషన్ సమయంలో చేసిన వ్యాఖ్యలను చూశాం. ఆయన చేసిన వ్యాఖ్యలు -మిగతా 2లో



## లలిత్‌మోదీకి సుప్రీంలో చుక్కెదురు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 30)

ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ అయిన ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ కి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనలను ఉల్లంఘించిన కేసులో లలిత్ మోదీకి ఈడీ రూ.10.65 కోట్ల జరిమానా విధించడాన్ని సవాలు చేస్తూ.. ఆ మొత్తాన్ని బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలని ఆయన వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. అయితే, చట్టం ప్రకారం తనను తాను రక్షించుకునే హక్కు లలిత్ మోదీకి ఉందని జస్టిస్ పీఎస్ నరసింహ.. ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఫెమాను ఉల్లంఘించినందుకు ఈడీ తనపై విధించిన రూ.10.65 కోట్ల జరిమానాను చెల్లించేలా బీసీసీఐని ఆదేశించాలని కోరుతూ లలిత్ మోదీ గతేడాది డిసెంబర్‌లో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఆ సమయంలో తాను ఇండియన్ ప్రీమియర్ లీగ్ పాలకమండలికి ఛైర్మన్‌గా ఉన్నానని.. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఆఫీస్ బేరర్లు అధికారిక విధుల్లో ఉన్నప్పుడు సమస్య వస్తే ఆ సంస్థే వారికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా ఆయన వేసిన పిటిషన్‌లో అర్థం లేదని పేర్కొంటూ బాంబే హైకోర్టు దానిని కొట్టివేసింది. జరిమానాగా రూ.లక్ష చెల్లించాలని లలిత్ మోదీని ఆదేశించింది. దీంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు. ఐపీఎల్‌కు బాస్‌గా -మిగతా 2లో



## గత ప్రభుత్వం రూ.3 వేల కోట్లు పక్కదారి పట్టించింది

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 30)

గత వైకాపా ప్రభుత్వం మున్సిపల్ శాఖకు చెందిన రూ.3 వేల కోట్లను పక్కదారి పట్టించిందని మంత్రి నారాయణ విమర్శించారు. నెల్లూరు నగరం 45వ డివిజన్ పొగతోటలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రెయిన్ల పనులన్నీ త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ -మిగతా 2లో



## ఎమర్జెన్సీ పోరాట యోధుల్ని సదా స్మరించుకోవాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 30)

దేశంలో ఎమర్జెన్సీ విధించినవారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయవిభాగాన్ని కీలుబొమ్మగా మార్చుకోవాలని అనుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. నాటి నిర్బంధంపై పోరాడిన యోధులను కచ్చితంగా స్మరించుకోవాలని, అది రాజ్యాంగాన్ని కాపాడుకోడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవడాన్ని ఆదివారం నాటి 123వ 'మన్‌కీ బాత్'లో ప్రధాని ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై గళమెత్తిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్‌రామ్‌ల ఆడియో ప్రసంగాలను కాసేపు వినిపించారు. భారత జనాభాలో దాదాపు 95 కోట్లమంది (64 శాతం) ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని మోదీ చెప్పారు. 2015 నాటికి సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్లమందికి అందేవని -మిగతా 2లో



## బీహార్ ఎన్నికల్లో పొత్తులపై అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు

**మహాకూటమితో పొత్తుకు సిద్ధమన్న ఒవైసీ**

**బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య**

**బీహార్ ఓటర్ల జాబితాపై తీవ్ర అభ్యంతరం**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 30)

బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కూడిన మహాకూటమితో పొత్తు కోసం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. బీహార్ రాష్ట్ర ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్ నేతృత్వంలో ఎన్నికల ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఒవైసీ తెలిపారు. బీజేపీ, ఎన్డీఏలను కట్టడి చేసేందుకు మహాకూటమితో కలిసి పనిచేయాలని భావిస్తున్నామన్నారు. ముఖ్యంగా తమ పార్టీకి క్రియాశీల కార్యకర్తల బలం అధికంగా ఉన్న సీమాంచల్ ప్రాంతంపై ప్రత్యేకంగా దృష్టి -మిగతా 2లో

## మోదీని నిలదీసే ధైర్యం వారికెక్కడిది జగన్, చంద్రబాబులపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు

**చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోదీకి దాసోహమయ్యారన్న షర్మిల**

**కాంగ్రెస్ లోకి రావాలంటూ నేతలు, యువతకు సూచన**

**రాహుల్ ప్రధాని అయితే విభజన హామీలు అమలవుతాయని వ్యాఖ్య**

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 30)

ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ ఇద్దరూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దాసోహమయ్యారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని ప్రశ్నించే సత్తా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం కోసం ఈ జూన్ నెలలోనే 26 జిల్లాల్లో సుమారు 2,500 కిలోమీటర్లు పర్యటించానని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కినా, రాష్ట్రానికి చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా కేంద్రాన్ని నిలదీసే పరిస్థితిలో లేరని షర్మిల ఆరోపించారు. -మిగతా 2లో



# అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీగా మారుస్తాం

మంత్రి మాట్లాడుతూ.. ఈ వర్క్ షాప్ కు హాజరైన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, విద్యారంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఇతర అధికారులకు స్వాగతం. అమరావతి వర్క్ షాప్-2025కు మిమ్మల్ని స్వాగతించడం గౌరవంగా భావిస్తున్నా. ఇవాళ ఈ సమావేశం దేశంలో అత్యుత్తమ క్వాంటమ్ మేధావుల సమావేశం మాత్రమే కాదు. దేశంలో ఓ కీలక మలుపు కానుంది. భవిష్యత్ లో రాబోయే సాంకేతిక విప్లవానికి సీఎం చంద్రబాబు నేతృత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నారనే సంకేతాన్ని ఇస్తోంది.

**అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మారుస్తాం**

అమరావతిని దక్షిణాసియాలోనే మొట్టమొదటి క్యాంటమ్ వ్యాలీగా మార్చాలనేది మా లక్ష్యం. ఇక్కడ ఆలోచనలు ఆవిష్కరణలుగా, ఆవిష్కరణలు పరిశ్రమలుగా మారేలా ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇది ఒకరోజు కార్యక్రమం కాదు. ఇది దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఉద్యమం. ఇందుకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా నిలవబోతోంది. క్యూబిట్ ఆర్కిటెక్చర్ నుంచి క్రయో ఎలక్ట్రానిక్స్ వరకు, ఆల్గోరిథం అభివృద్ధి నుంచి అంతర్జాతీయ క్వాంటమ్ ప్రమాణాల వరకు మేం పూర్తిస్థాయిలో క్వాంటమ్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తాం. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన 156 క్యూబిట్లను కలిగిన ఐబీఎం క్యాంటమ్ సిస్టమ్-2 త్వరలోనే అమరావతిలో అందుబాటులోకి రానుంది. ఇది చాలా గర్వించదగ్గ విషయం.

ఆసియాలో మొట్టమొదటి క్వాంటమ్ ప్రమాణాల టెస్ట్‌బెడ్‌ను ఎన్పీఎల్, ఐఈఈఈ, సీయాక్, ఏడబ్ల్యూఎస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఐబీఎం, టీసీఎస్, హెచ్ సీఎల్, టెక్ మహీంద్ర వంటి అగ్రగామి సంస్థల సహకారంతో క్యాంటమ్ స్టారప్ ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. ఈ కార్యాచరణకు వ్యూహాత్మక దూరదృష్టి ఉంది. ఇది ప్రధాని మోదీ ప్రకటించిన జాతీయ క్వాంటమ్ మిషన్ కు అనుసంధానంగా, గ్లోబల్ భాగస్వామ్యాలతో నిర్మించడం జరుగుతుంది. ఐఐటీలు, ఐఐఎస్, టోక్యో యూనివర్సిటీల సహకారం తీసుకోవడం జరుగుతుంది.

**చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ**

సీఎం చంద్రబాబు సాంకేతిక విప్లవం రెండో చాప్టర్ క్యాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ. చంద్రబాబు మొదటి చాప్టర్ ఐటీ అన్నప్పుడు నేను ఏడో తరగతి చదువుతున్నాను. దక్షిణాసియా క్వాంటమ్ కేంద్రంగా అమరావతి అభివృద్ధి చెందుతుంది. సాఫ్ట్ వేర్ రంగానికి సిలికాన్ వ్యాలీగా అమరావతి క్యాంటమ్ వ్యాలీ అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు విజన్ సాధనకు అనుగుణంగా పనిచేస్తూ ప్రపంచపటంలో అమరావతి క్వాంటమ్ కు చోటు దక్కేలా కృషిచేద్దాం.

**ఏపీ బ్రెయిన్ క్యాపిటల్ గా మారుతుంది**

సీఎం చంద్రబాబు లాంటి నాయకుడు ఉండటం మన అదృష్టం. విజన్ అంటే ఇప్పుడు వెలాసిటీ, ఇన్నోవేషన్. గ్లోబల్ రేస్ లో చేరడం కాదు.. మనమే దారి చూపాలి. ఫలితంగా ఏపీ బ్రెయిన్ క్యాపిటల్ గా మారుతుంది. క్వాంటమ్ సైన్స్ ను ఇంజనీరింగ్ లోనూ భాగం చేస్తున్నాం. అమరావతిని క్యాంటమ్ టెక్నాలజీలకు కేంద్రంగా మారుస్తాం. ఇన్నోవేటివ్, స్టార్టప్ లకు ఈ క్యాంటమ్ వ్యాలీ పార్క్ ఓ లాంచ్ ప్యాడ్ అవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సందీప్ పటేల్, ఐబీఎం క్వాంటమ్ అడాప్షన్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రోడర్, టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్ వేర్ అండ్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న, ఎల్ అండ్ టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, అడ్వైజర్ ఎంవీ సతీశ్, ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కే మధుమూర్తి, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్షంలో భారత్ నిఘా నేత్రం 52 మిలిటరీ ఉపగ్రహాల ప్రయోగం వేగవంతం

2026న కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. 2029 చివరికి మొత్తాన్ని అంతరిక్షంలోకి చేర్చనున్నారు. ఇస్రో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ టెక్నాలజీని ప్రైవేటు సంస్థలకు బదలాయించి.. వాటికి ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వామ్యం ఇవ్వనుంది. అత్యవసర సమయాల్లో వేగంగా ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇది ఉపయోగపడనుంది. లోఎర్త్, జియో స్టేషనరీ కక్ష్యలపై దృష్టిపెట్టే ఈ ప్రాజెక్టును ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ పర్యవేక్షించనున్నారు. చైనా యాంటీ శాటిలైట్ సామర్థ్యానికి కౌంటర్‌గా కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భారత్ భారీ స్థాయిలో ఉపగ్రహాలను కూడా ఆపరేషన్ సిందూర్ కోసం మోహరించింది. వీటిల్లో ఇస్రో వాడుతున్న ఉపగ్రహాలతో పాటు.. అంతర్జాతీయ మద్దతు కూడా తీసుకొంది. భారత్ వద్ద 9-11 మిలిటరీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఇస్రో వీటి నుంచి నిరంతరం డేటాను దళాలకు చేరవేసింది. దీంతోపాటు ఓ కమర్షియల్ గ్లోబల్

## మొదటిపేజీ తరువాయి

ఆపరేటర్ నుంచి చిత్రాలను సేకరించింది. ఇస్రో సొంతంగా వాడే కార్టోశాట్ సిరీస్‌లోని వాటిని కూడా రంగంలోకి దించింది. వీటి ఆధారంగా మన దళాలు పక్కా ప్లానింగ్ చేసి.. పాక్ సైనిక స్థావరాలను దెబ్బతీశాయి. అమెరికాకు చెందిన మ్యాక్సర్, ఐరోపాకు చెందిన సెంటినెల్ సేవలు కూడా భారత్ వాడుకొంది. ఇవి అయితే.. రోజుకు ఒకసారి అయినా చిత్రాలను డౌన్‌లోడ్స్ చేసుకోవచ్చు. ఇక మన దేశానికి చెందిన ఉపగ్రహాలు పీరియాడిక్ డేటాను 14 రోజులకు ఒకసారి తీసుకొనే అవకాశం ఉంది. తాజాగా చేపట్టిన ప్రాజెక్టు పూర్తయితే భారత్ చేతికి యుద్ధరంగంలోని రియల్‌టైమ్ డేటా వేగంగా అందే అవకాశం ఉంది.

# ‘ఆపరేషన్ సిందూర్’.. రక్షణ అధికారి వ్యాఖ్యల ఉద్దేశం అది కాదు: భారత ఎంబసీ వివరణ

సందర్భోచితం కాదు. కొన్ని మీడియాల్లో వేరు చేసి ఉదహరించినట్లుగా ఉంది. ఆయన ఉద్దేశాన్ని తప్పుగా చిత్రీకరించినట్లు అనిపిస్తోంది. మన పొరుగున ఉన్న కొన్ని దేశాల మాదిరిగా కాకుండా.. భారత సాయుధ దళాలు పౌర రాజకీయ నాయకత్వంలో పనిచేస్తాయని ఈ ప్రెజెంటేషన్ తెలియజేస్తోంది. భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ లక్ష్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడమే. పరిస్థితులు తీవ్రతరం కాకుండా ఉండేలా స్పందించడం జరిగింది” అని భారత రాయబార కార్యాలయం పేర్కొంది.

# లలిత్‌మోదీకి సుప్రీంలో చుక్కెదురు

ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశాడని లలిత్ మోదీ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీంతో 2010లో లండన్‌కు పారిపోయిన అతడు.. అప్పటినుంచి అక్కడే ఉంటున్నాడు. ఆయనను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది.

# గత ప్రభుత్వం రూ.3 వేల కోట్లు పక్కదారి పట్టించింది

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. నెల్లూరులోని 6.7 కిలోమీటర్ల పరిధిలోని కాలువలన్నింటిలో పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 15 రోజుల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. “గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది. రూ.పది లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి మిగిల్చి వెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో పరిస్థితులు గాడిన పడుతున్నాయి. వైకాపా ఆపేసిన అభివృద్ధి పనులన్నీ తిరిగి ప్రారంభిస్తున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలతో పేద పిల్లల కోసం సిద్ధమైన వీఆర్ హైస్కూల్‌లో ఈరోజు నుంచి తరగతులు ప్రారంభిస్తున్నాం” అని నారాయణ తెలిపారు.

# ఎమర్జెన్సీ పోరాట యోధుల్ని సదా స్మరించుకోవాలి

గుర్తు చేశారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యావత్ ప్రపంచం జరుపుకొందని, అందరి జీవితాల్లో యోగా భాగమవుతోందని హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుభాంశు శుక్లాకు అభినందనలు తెలిపిన ప్రధాని.. భారతదేశం కొత్త చరిత్రను లిఖించిందన్నారు.

**యోగా దినోత్సవం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది**

ఈ ఏడాది అద్భుతంగా జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం.. యోగాను తమ జీవితంలో అంతర్భాగంగా మార్చుకొనేలా మరింత మందికి కచ్చితంగా స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా చేసిన ప్రసంగంలో విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరోసారి గుర్తుచేసుకున్నారు. “ఈ సారి కూడా జూన్ 21న దేశంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాలుపంచుకున్నారు. విశాఖపట్నంలో సముద్రం ఒడ్డున 3 లక్షల మంది ప్రజలు ఒకేసారి యోగా చేశారు. విశాఖపట్నం నుంచే మరో అద్భుతమైన దృశ్యం మనముందు కనిపించింది. తెలంగాణలో 3వేల మంది దివ్యాంగులు ఒకేచోట యోగాలో భాగస్వాములు అయ్యారు. సశక్తీకరణకు యోగా ఎలా మాధ్యమంగా మారిందన్న విషయాన్ని వారు ఆచరణలో చూపించారు. యోగాను తమ జీవితంలో అంతర్భాగంగా మార్చుకొనేలా మరింతమందికి కచ్చితంగా స్ఫూర్తినిస్తుంది” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# బీహార్ ఎన్నికల్లో పొత్తులపై అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు

సారించినట్లు వివరించారు. గతంలో కూడా ఎన్డీఏను నిలువరించడానికి తీవ్రంగా ప్రయత్నించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.అయితే, పొత్తుల విషయంలో మహాకూటమి పార్టీలు ముందుకు రాని పక్షంలో తమ ప్రణాళిక భిన్నంగా ఉంటుందని ఒవైసీ తేల్చిచెప్పారు. పొత్తులు కుదరకపోతే, బీహార్‌లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఇదే సమయంలో, బీహార్‌లో ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ పేరుతో చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిబంధనల వల్ల వేలాది మంది నిరుపేదలు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ముఖ్యంగా సీమాంచల్ వంటి ప్రాంతాల్లో వరదల కారణంగా సర్వం కోల్పోయి అనేక కుటుంబాలు వలస వెళ్తుంటాయని అన్నారు. అలాంటి నిరుపేదలను ఓటరుగా నమోదు కావడానికి బర్త్ సర్టిఫికెట్, నివాస ధ్రువపత్రంతో పాటు తల్లిదండ్రుల నివాస పత్రాలు కూడా చూపాలని అడగడం సరికాదని ఆయన అన్నారు. ఈ కఠిన నిబంధనల వల్ల పేదలు తమ ఓటు హక్కుకు దూరమవుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# మోదీని నిలదీసే ధైర్యం వారికెక్కడిది జగన్, చంద్రబాబులపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు

“కేంద్రంలో మోదీ అధికారంలో ఉండటానికి చంద్రబాబే కారణం. అయినా కూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయన కేంద్రంపై కనీస ఒత్తిడి తీసుకురావడం లేదు. మరోవైపు, కేంద్రం మెడలు వంచుతామని చెప్పిన జగన్ చివరికి తన మెడనే మోదీ ముందు వంచారు” అని ఆమె ఎద్దేవా చేశారు. జగన్ ఇప్పటికీ మోదీని ఒక్క మాట అనకుండా, కేవలం చంద్రబాబును విమర్శిస్తూ దత్తపుత్రుడిలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకు కుదిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నా, రాష్ట్రం నుంచి ఒక్క ఎంపీ కూడా దానిపై మాట్లాడకపోవడం దారుణమని షర్మిల మండిపడ్డారు. రాజధాని అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా అప్పులు ఇవ్వడమేంటని ఆమె ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతామన్న హామీపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదని గుర్తుచేశారు. విభజన హామీలు ఏవీ అమలు కాకపోయినా, చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోదీకి మద్దతు పలకడం విచారకరమన్నారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మొదటి నుంచి బీజేపీని వ్యతిరేకించారని, కానీ జగన్ మాత్రం మోదీకి గులాంగిరీ చేశారని విమర్శించారు.

రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని షర్మిల ధీమా వ్యక్తం చేశారు. “రాజకీయాలపై ఆసక్తి ఉండి, భవిష్యత్తులో ఎమ్మెల్యేలు కావాలనుకునే వారు, రాష్ట్రానికి సేవ చేయాలనుకునే వారు కాంగ్రెస్‌లోకి రావాలి. అందరం కలిసి పనిచేద్దాం” అని ఆమె పిలుపునిచ్చారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, వైఎస్ఆర్ వంటి నేతల త్యాగాలతో నిండిన కాంగ్రెస్ పార్టీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే రాష్ట్ర విభజన హామీలు పూర్తిగా అమలవుతాయని పేర్కొంటూ, సోనియా, రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ తిరిగి బలపడుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# జులై 8 కంటే ముందే భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ప్రకటన..

రంగంలో కన్సెషన్లను కోరుతోంది. విద్యుత్తు కార్లు, వైన్స్, పెట్రోకెమికల్స్, డెయిరీ, యాపిల్, నట్స్, జన్యుపరమైన మార్పులు చేసిన పంటల విషయంలో లబ్ధి కోసం పట్టుబడుతోంది. గత శుక్రవారం ట్రంప్ మాట్లాడుతూ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనే అవకాశాలున్నాయని హింట్ ఇచ్చారు. దీనిని అతిపెద్ద ఒప్పందంగా ఆయన పేర్కొన్నారు.

# ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కారించాలి

**జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్**

**ప్రజా ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం**

**పోలీస్ గ్రీవెన్స్‌కు 83 ఫిర్యాదులు**




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)**

ప్రజల నుండి వచ్చే పలు రకాల ఫిర్యాదులను పరిష్కరించేందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక”(మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో వారి సమస్యలను ధైర్యంగా ఎస్పీ గారికి విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ గారు ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఆయా ఫిర్యాదులపై జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు,జాబ్ మోసాలు, భూ వివాదాలు, ఇతర సమస్యల గురించి ప్రజలు వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని బంగారపు నెక్లెస్ తయారు చేయిస్తానని నమ్మించి, తన వద్ద నుండి సంతనూతలపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పలు దఫాలుగా రూ.1,77,000 అడ్వాన్స్‌గా తీసుకొని బంగారపు ఆభరణం, డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని సంతనూతలపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. గవర్నమెంట్ లోన్ ఇప్పిస్తానని చెప్పి ఒంగోలు మామిడి పాలానికి చెందిన ఒక వ్యక్తి రూ.3,00,000 డబ్బులు తీసుకొని లోను ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు అడుగుతుంటే ఇవ్వడం లేదని మామిడి పాలానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్స్‌పెక్టర్ దుర్గ ప్రసాద్, డీటీసి ఇన్స్పెక్టర్ షమీముల్లా, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.




# జూలై 2 నుండి శ్రీగిరిలో అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలు

**శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)**



శ్రీగిరి క్షేత్ర పాలకుడు అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలను జూలై 2 నుండి 4వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీ వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి వెల్లడించారు. 2వ తేదీ బుధవారం ఉదయం 7 గంటలకు అభయాంజనేయ స్వామి వారికి అభిషేకం, భక్తులచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతాయి, సాయంత్రం అభయాంజనేయ స్వామి వారికి అర్చన, 6.30 లకు శ్రీవారికి ఊంజల సేవ, శ్రీ గిరీ దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్‌చే గాత్ర కచేరీ జరుగుతాయి. మూడో తేదీ గురువారం ఉదయం 9 గంటలకు హనుమత్ యాగం, పూర్ణాహుతి జరుగుతాయి. 4వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటలకు శ్రీవారికి శుక్రవార అభిషేకం నిర్వహిస్తారు, 7 గంటలకు మునుకుట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి చే సుందరకాండ పారాయణ జరుగుతుంది. భక్తులు ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి ధర్మకర్తలు కోరారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 01.07.25 మంగళవారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం


# దళిత మహిళా సిఐకి ఘోర అవమానం



- ఎస్ఐ పై చర్యల కోసం ఎదురుచూపులు
- అధికార దుర్వినియోగం, కులదురాగత వ్యాఖ్యలతో నిండిన వ్యవహారం
- ఇరువురిని పిలిచి విచారిస్తున్నాం
- సిఐ పై చేసిన వ్యాఖ్యలు నిజమని తేలితే కఠిన చర్యలు
- వ్యక్తిత్వం పై మాటలు తూలితే డిపార్ట్మెంట్ రూల్స్ ప్రకారం చర్యలు
- షణ్ముఖ వెలుగు ప్రతినిధితో ఎక్సైజ్‌శాఖ ఈఎస్ షేక్ ఆయేషా బేగం

(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 30)

పొదిలి ఎక్సైజ్ స్టేషన్‌లో మానవీయ విలువలకు వ్యతిరేకంగా, కుల వివక్షను ఆవిష్కరించే ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది నెలల క్రితం ఎక్సైజ్ డిపార్ట్మెంట్ చేసిన బదిలీలలో పొదిలి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్‌గా నియమితులైన దళిత మహిళా అధికారిని అదే స్టేషన్ లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అవమానించడమే కాక, కుల దూషణలు చేసి అధికార వ్యవస్థను తక్కువ చేసిన సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ నెల 29న జరిగిన ఈ ఘటనలో ఇన్స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వకుండా అదే స్టేషన్‌లో పనిచేస్తున్న అగ్రకులానికి చెందిన ఎస్ఐ అకస్మాత్తుగా మద్యం బెల్ట్ షాప్ పై దాడికి వెళ్ళాడు. ఇద్దరిని పట్టుకొని స్టేషన్‌కి తీసుకొచ్చినా వారి పై ఎలాంటి కేసు నమోదు చేయకుండా వదిలేశాడు. తన పై అధికారిణి దీనిని గమనించి కారణం అడగగా, అతను దారుణంగా స్పందించినట్లు సమాచారం... "నువ్వేమైనా రెడ్డి, కమ్మ కులానికి చెందిన దానివా? నీ కులం ఏదో తెలుసుకో... అప్పుడే నీతో మాట్లాడతాను అని కులపరంగా దూషించాడని సమాచారం. ఇంతటితో ఆగకుండా, "నీవేమైనా అందగత్తెవా? నీ మొహం చూసుకుని నేనే మూడు నెలలుగా సెలవులో ఉన్నాను. నీవంటి వారి కింద పని చేయడం నాకు బంధనంలా ఉంది" అంటూ తీవ్రంగా అవమానించాడు. అనంతరం స్టేషన్‌ను వదిలి వేగంగా బయటకు వెళ్ళిపోయాడని తెలిసింది.

ఈ విషయాన్ని సదరు దళిత మహిళా ఉద్యోగి వెంటనే డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లకు ఫోన్ ద్వారా తెలియజేసింది. వారు వెంటనే స్పందించి "సోమవారం ఉదయం మొదటి గంటలో రిపోర్టు రాయించి రావాలి" అని ఆదేశించారు. ఉద్యోగి సంఘాల నాయకులకు కూడా ఈ ఘటనను తెలియజేయడంతో వారు సంఘీభావం ప్రకటించారు. జూన్ 30 సోమవారం బాధిత ఉద్యోగి ఒంగోలులో ఉన్న ఎక్సైజ్ ఉన్నతాధికారులను కలసి పూర్తిగా వివరాలు తెలియజేశారు.

అయితే ఈ సమయంలో కొంతమంది డిపార్ట్మెంట్ వ్యక్తులు రాజీ కోసం ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అయినా ఆమె అంగీకరించకుండా, సాహసంగా పోరాడుతుంది. ఈ ఘటన పై స్పందన లేకుండా వదిలేస్తే, ఇది తక్కువ స్థాయి అధికారుల చేతుల్లో ఉన్న దళిత మహిళల అధికారులకు ఎంత ప్రమాదకరమైన వాతావరణమో చూపిస్తుంది. బాధిత అధికారిణి న్యాయపరంగా గౌరవం కోరుకుంటుండగా, ఎస్ఐ పై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండు ఊహించలేని స్థాయిలో పెరిగింది. డిపార్ట్మెంట్ ప్రతిష్టను కాపాడాలంటే ఇలాంటి దుర్గుణాలను సహించకుండా, న్యాయంగా, సమర్థంగా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికార బాధ్యతల్లో మానవీయతను, గౌరవాన్ని నిలబెట్టే చర్యలు ఇప్పుడు అత్యవసరం.

### వాస్తవాల పై విచారణ చేస్తున్నాం
### ఎక్సైజ్‌శాఖ ఈఎస్ షేక్ ఆయేషా బేగం

పొదిలి ఎక్సైజ్‌శాఖలో జరిగిన సంఘటన పై షణ్ముఖ వెలుగు దినపత్రిక ప్రతినిధి ఎక్సైజ్ శాఖ ఈఎస్ ను ఫోన్‌లో సంప్రదించగా దళిత మహిళా సిఐ లిఖిత పూర్వక ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని ఆమె తెలిపారు. వాస్తవాలను తెలుసుకునేందుకు ఇరువురితోనూ మాట్లాడుతున్నామన్నారు. ఇరువురిని పిలిచి వారి స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నామన్నారు. ఏది ఏమైనా కానీ ఓ మహిళను ఇష్టానుసారంగా తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా మాట్లాడడం సరైంది కాదన్నారు. ఎస్ఐ చేసిన వ్యాఖ్యలు నిజమని తేలితే డిపార్ట్మెంట్ రూల్స్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేసేది లేదన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూస్తామని ఆమె తెలిపారు.

# 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'

### ప్రకాశం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు చేసిన మోసాలు తెలుస్తాయని వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం బూచేపల్లి అధ్యక్షతన ముఖ్య అతిథులు ప్రకాశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరావు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు, బత్తుల బ్రహ్మానందరెడ్డిరెడ్డి ఆధ్వర్యంలో "బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ" ప్రకాశం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి,మండల స్థాయి, గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని గ్రామ గ్రామానికి ప్రచారం కార్యక్రమం దశల వారీగా రెండో దశ (జూలై 4వ తేదీ నుండి 12వ తేదీలోపు) గౌరవ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త – నియోజకవర్గ స్థాయిలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహణ ,నియోజకవర్గంలోని కీలకమైన నాయకులు అంతా హాజరు కావాలి. ఇందులో మండల పార్టీ అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, అలాగే ఆయా కమిటీల సభ్యులు హాజరుకావాలి అని బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. మూడో దశ (జూలై 13వ తేదీ నుండి 20వ తేదీలోపు) గౌరవ శాసన సభ్యులు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యంలో – మండలస్థాయిలో విస్తృత సమావేశం నిర్వహణ. ఇందులో మండల పార్టీ అధ్యక్షులతో సహా, పార్టీ మండల కమిటీలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, (తరువాయి 4లో...)




# ముగ్గురు తహశీల్దార్లు ఉద్యోగ విరమణ పొందడం బాధాకరం

### జిల్లా కలెక్టర్ జె వెంకట్ మురళి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 30)




బాధ్యతతో పనిచేసే ముగ్గురు తాహాశీల్దారులు ఒకే రోజు ఉద్యోగ విరమణ పొందడం చాలా భాధాకరం అని జిల్లా కలెక్టర్ జె వెంకట్ మురళి అన్నారు. రెవెన్యూ శాఖలో గత 40 సంవత్సరాలుగా పనిచేసే ఉద్యోగి విరమణ పొందుతున్న ముగ్గురు తహసీల్దార్లకు ఉద్యోగ విరమణ కార్యక్రమంను సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ కుమారి పి సీతారత్నం 1995లో రెవెన్యూ శాఖలో చేరి సుమారు 30 సంవత్సరాల సర్వీసు పూర్తి చేశారని ఆయన అన్నారు. మీరు అంకితభావంతో, క్రమశిక్షణతో పని చేశారని, అందరిని కలుపుకుపోయే మనస్తత్వమని అన్నారు. ఎస్ వెంకట్ రత్నం 1984లో రెవెన్యూ సర్వీసులో చేరి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. వీరు సర్వీసులో ఎటువంటి మచ్చ లేకుండా పనిచేశారని, వారి సేవలు మరువరానివని ఆయన అన్నారు. కెవిబిటి సుందరమ్మ 1987లో టైపిస్టుగా నిజాంపట్నంలో చేరి అంచలంచలుగా తహసిల్దార్ స్థాయికి ఎదిగారని అన్నారు. ఈ ముగ్గురు తహసిల్దార్లు చట్ట ప్రకారం పని చేసే వారిని, చట్టాన్ని ఉల్లంఘించి పని చేసేవారు కాదని, వీరికి అప్పగించిన పనిని పూర్తి చేసే వరకు నిద్రపోయేవారు కాదని ఆయన అన్నారు. రెవెన్యూ శాఖలో పని చేయటం కత్తి మీద సాము వంటిదని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కఠినమైన పరిస్థితిలో పనిచేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పనిచేస్తున్నందున ప్రజల ఆకాంక్షలను మన సేవల ద్వారా నెరవేర్చాలని అన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే క్రమంలో వత్తిడి ఉంటుందని అన్నారు. ఆ వత్తిడిని జయిస్తూ ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల సమయంలో రెవిన్యూ సిబ్బంది సరిహద్దుల్లో సైనికులు పనిచేసే విధంగా పనిచేస్తారని ఆయన అన్నారు. పాత తరం వారు ఉద్యోగంలో కొంతవరకు ప్రశాంతతతో పనిచేసినట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల విషయంలో, శాఖపరమైన పనుల్లో, ఇతరులకు సలహాలు ఇచ్చి విషయంలో, వారు సొంతంగా నేర్చుకునే విషయంలో, వారి యొక్క విధులను నిర్వర్తించే క్రమంలో బాగా పనిచేశారని అని ఆయన అన్నారు. రాను రాను సాంకేతికత పెరిగిందని, చదువులు పెరిగాయని, కానీ ఉద్యోగుల్లో సామర్థ్యం తగ్గుతుందని, సామర్థ్యాన్ని పాత తరం వారి వద్ద నుండి నేర్చుకోవాలని పెంచుకోవాలని ఆయన అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు తహసిల్దార్లను సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు తహసీదార్ల యొక్క సేవలను రెవెన్యూ అధికారులు సిబ్బంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి గ్లోరియా, ప్రత్యేక ఉప కలెక్టర్ లవన్న, పరిపాలన అధికారి మల్లికార్జునరావు, కలెక్టరేట్ సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.




# రాష్ట్ర ప్రభుత్వం మానవత్వంతో పాలన సాగిస్తుంది

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 30)

రాష్ట్ర ప్రభుత్వం మానవత్వంతో పాలన సాగిస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతుల కొరకు బాపట్ల జిల్లాలో మూడు కొనుగోలు కేంద్రాలను మంత్రి పార్థసారథి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలిసి రిబ్బన్ కత్తిరించి సోమవారం ప్రారంభించారు. జె పంగులూరు మండలం జె.పంగులూరు గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఒక కేంద్రం ప్రారంభించగా, ఇంకొల్లు మండలం ఇంకొల్లు మార్కెట్ యార్డులో మరొక కేంద్రం ఏర్పాటు చేశారు. పర్చూరు మండలం వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో ఒక కొనుగోలు కేంద్రాన్ని మంత్రి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. పొగాకు కనుగోలు కేంద్రాల్లో ప్రారంభమైన వేలాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్లాక్ బర్లీ పొగాకు చివరి ఆకు వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులంతా ధైర్యంగా ఉండాలని మంత్రులు వారికి భరోసా కల్పించారు. రైతులకు ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ వారి పక్షాన నిలిచి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుందని మంత్రి పార్థసారథి చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి పట్టాలు ఎక్కించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు పండించాలని రైతులపై ఒత్తిడి చేసిన కంపెనీలు పంట చేతికి రాగానే చేతులెత్తేశారన్నారు. ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. పొగాకు సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి ప్రభుత్వమే కొనుగోలు చేసేలా జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కృషి చేశారన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు పంటను కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు అనుకూలమైన వాతావరణంలో పాలన సాగిస్తుందని వివరించారు. ప్రభుత్వం ఉద్దేశించినట్లు రైతులకు మేలు జరిగేలా అధికారులు వడివడిగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయాలు చాలా బాగున్నాయని ఆయన కితాబిచ్చారు. మరోసారి నష్టానికి గురిగాకుండా సాంకేతికతను అందిపించుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం అందుబాటులోనే ఉందని ఆయన చెప్పారు. రూ.1637 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించిందన్నారు. రూ.13,800 కోట్ల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేసిందన్నారు. మంచి పాలనలో పెట్టుబడి పెట్టడానికి వివిధ కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు (తరువాయి 4లో...)

# రాష్ట్ర ప్రభుత్వం మానవత్వంతో పాలన సాగిస్తుంది



పూర్తయితే పంటల సాగు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నారు. రైతుల నుంచి బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేయడానికి దుద్దుకూరు, భీమవరం, ఇంకొల్లులో మరో మూడు కొనుగోలు కేంద్రాలు కొత్తగా ప్రారంభిస్తామని చెప్పారు. రైతుల ఇబ్బందులను తొలగించడానికే బ్లాక్ బర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. మార్టూరు, కొరిశపాడు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవించగానే ఆమోదం తెలిపారన్నారు. పొగాకు కొనుగోలు చేయడానికి రూ.270కోట్లను ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రైతుల నుంచి ప్రతి ఆకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. బ్లాక్ బర్లీ పొగాకును మూడు గ్రేడ్ లుగా విభజించి, ఏ-గ్రేడ్ రకం పొగాకు క్వింటాకు రూ.12,000ధర నిర్ణయించిందన్నారు. బి-గ్రేడ్ రకం పొగాకు రూ.9,000లు, సి-గ్రేడ్ రకం క్వింటా పొగాకు రూ.6,000లు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రతిరోజు ఒక కొనుగోలు కేంద్రంలో 20 మంది రైతులు నుంచి బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేయడానికి సన్నాహాలు చేసిందన్నారు. మార్క్ ఫెడ్ నిబంధనలను అనుసరించాలని ఆయన














సూచించారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ధాన్యం, కోకో, మామిడి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వం నిలిచిందన్నారు. వచ్చే సంవత్సరం ప్రభుత్వం అనుమతి లేకుండా బ్లాక్ బర్లీ పొగాకు సాగు చేయరాదన్నారు. ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేయాలన్నారు. రైతులు మరోసారి మోసపోవద్దని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయంతోనే పొగాకు రైతులు సమస్యల నుంచి గట్టెక్కుతున్నారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. కంపెనీల మాటలు విని రైతులు మోసపోవద్దన్నారు. గతేడాది బ్లాక్ బర్లీ పొగాకు మంచి ధర రాగానే నిరుద్యోగుల సైతం విస్తారంగా 65 వేల ఎకరాల్లో పంటలుసాగు చేశారన్నారు. అనుమతి కంటే అత్యధికంగా పంటల సాగు చేయడం, అంతర్జాతీయ మార్కెట్ లో ధరలు తగ్గడంతోనే సమస్య వచ్చిందన్నారు. రైతుల సమస్యకు పరిష్కారం చూపుతూ రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు ప్రారంభించిందన్నారు. బాపట్ల జిల్లా 12 మండలాల్లో పంటల సాగు చేయగా వాటిని కొనుగోలు చేయడానికి 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చిట్టచివరి రైతు నుంచి పొగాకు కొనుగోలు చేస్తామన్నారు. ఇప్పుడు వరకు 342 మంది రైతుల నుంచి రూ.మూడు కోట్ల విలువైన 342 టన్నులు బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు వివరించారు. వెంటనే రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమా అవుతాయన్నారు. ప్రతిరోజు 30 టన్నులు పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం యాప్ లో నమోదు చేసుకున్న వారు, వారికి కేటాయించిన తేదీల్లోనే పొగాకు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. రైతుల పక్షాన బాధ్యతతో ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేయడం సాహసోపేతమైన నిర్ణయం అని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి, కొనుగోలుకు రంగ ప్రవేశం చేసిందన్నారు. 48 గంటల్లోనే రైతుల ఖాతాలలోకి డబ్బులు వేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విదేశీ మారక ద్రవ్యం అత్యధికంగా కల్పించిన బ్లాక్ బర్లీ పొగాకు రైతులు ఇప్పుడు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఈ పంటపై ప్రభుత్వం నియంత్రణ లేకపోవడంతోనే సమస్య ఏర్పడిందన్నారు. పారదర్శకంగా పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. 20 శాతానికి మించి తేమ ఉండరాదన్నారు. ప్రతిరోజు 3000 క్వింటాళ్ల పొగాకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతుల నుంచి పూర్తిగా పొగాకు కొనుగోలు ముగిసే వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని, రైతులెవరు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్, బాపట్ల, చీరాల ఆర్డీవోలు పి గ్లోరియా, చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ ఏడి కరుణశ్రీ, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలి

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)

పోలీసు శాఖలో విశేష సేవలు అందించి పదవీ విరమణ పొందిన కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్, ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్ఐలను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, జ్ఞాపికలను బహుకరిస్తూ ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగానికి రిటైర్మెంట్ ఉన్నా, వ్యక్తిత్వానికి మాత్రం రిటైర్మెంట్ ఉండదన్నారు. సుదీర్ఘకాలం విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు, కఠిన పరిస్థితులు ఎదుర్కొంటూ ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేయడం చాలా ఆనందదాయకమని తెలిపారు. పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావంతో బాధ్యతాయుతంగా జిల్లా పోలీసు శాఖకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయన్నారు. వారి యొక్క సర్వీస్ లో రివార్డ్స్, సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, గుడ్ సర్వీస్ పొంది యున్నారు. ఎటువంటి రిమార్కులు లేకుండా 33 నుండి 41 సం.లు పాటు పోలీసుశాఖకు సేవలందించడం అభినందనీయమన్నారు. సకాలంలో రిటైర్మెంట్ ప్రయోజనాలు అందేటట్లు అన్ని చర్యలు తీసుకుంటామని, వచ్చిన డబ్బులను జాగ్రత్తగా, సరైన ప్రణాళికతో వినియోగించుకోవాలని సూచించారు. పోలీసు ఉద్యోగంలో సేవలందించేందుకు సహాయ, సహకారాలు అందించిన కుటుంబ సభ్యులకు జిల్లా పోలీసు శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు. వారిపట్ల ప్రేమ, ఆప్యాయతతో ఉండాలన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ అనంతరం ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని, పోలీసు శాఖ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో జి వెంకయ్య, ఉన్నం సుబ్బారావు, షేక్ అమీర్, పి లక్ష్మణ్ రావు, సయ్యద్ రఫి, సిహెచ్ బ్రహ్మానందంలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎఆర్ ఎస్ఐ తిరుపతి స్వామి, డిసిఆర్బీ ఎస్ఐ దేవకుమార్, వెంకటేశ్వర్లు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉలవపాడులో శ్రీ విజేత స్టోర్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 30)

ఉలవపాడు మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కందగడ్ల వరుణ్ సాయి ఆహ్వానం మేరకు విజేత జనరల్ స్టోర్స్‌ను సోమవారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందించాలని, వరుణ్ సాయి ప్రారంభించిన వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగ్గురు తహశీల్దార్లు ఉద్యోగ విరమణ పొందడం బాధాకరం







## సొంత నిధులతో వంటశాల గది నిర్మించడం అభినందనీయం

### కందుల రామిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 30)



సొంత నిధులతో ఉపాధ్యాయుడు పాఠశాలలో వంటగది నిర్మించడం అభినందనీయమని నియోజకవర్గ టిడిపి ముఖ్య నాయకుడు కందుల రామిరెడ్డి అన్నారు. మండలంలోని బోడపాడు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సొంత నిధులతో నిర్మించిన వంటగదిని సోమవారం నియోజకవర్గ టిడిపి నాయకులు కందుల రామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాకబ్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రవి, సురేఖ, బోడపాడు గ్రామ టిడిపి నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి, గొలమారు మహేశ్వర్ రెడ్డి, మార్కాపురం ఏఎంసి చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, గ్రామ టిడిపి నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గదిలో ఏర్పాటు చేసిన దేవత మూర్తుల చిత్రపటాలకు కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. మార్కాపురం పరిసర ప్రాంతాలలోనే బోడపాడు ఎంపీపీ పాఠశాలకు ప్రత్యేకత ఉందని ఆ ప్రత్యేకత ఉపాధ్యాయులు శ్రీను సార్ ద్వారా వచ్చిందని తెలిపారు. పాఠశాల, విద్యార్థుల అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన శుచి, రుచికరమైన, భోజనాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు జాకబ్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రతిభను కనబరచుటకు, పాఠశాలలో ఆధునీకరణ వసతుల కల్పనకు ఉపాధ్యాయులు శ్రీనివాసులు కృషి చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ బోడపాడు ఎంపీపీ పాఠశాల లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం నిరంతరం కృషి చేస్తుంటానని తెలిపారు.

ఈ పాఠశాలలో బోడపాడు గ్రామ విద్యార్థులతోపాటు మార్కాపురం పట్టణం నుండి కూడా 40 మంది విద్యార్థులు, పరిసర ప్రాంతాల నుండి సుమారు 20 గ్రామాల నుండి విద్యార్థులు ఈ పాఠశాలలో చేరుతున్నారన్నారు. తాను పాఠశాలకు బదిలీ అయినప్పుడు 30 మంది విద్యార్థులతో ఉందని ప్రస్తుతం 130 మంది విద్యార్థులను చేశామని తెలిపారు. ఉపాధ్యాయులు సురేఖ, టిడిపి నాయకులు గాయం వెంకట్ నారాయణ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు డీలర్ గంగిరెడ్డి రామకృష్ణారెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, సాదుల శేఖర్, చైతన్య రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'





అలాగే ఆయా కమిటీల సభ్యులు హాజరుకావాలన్నారు. నాలుగో దశ (జూలై 21వ తేదీ నుండి ఆగస్టు 4వ తేదీలోపు) గ్రామస్థాయిలో కార్యక్రమ నిర్వహించాలని సూచించారు. మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ డాక్టర్ మేరుగు నాగార్జున మాట్లాడుతూ గ్రామ స్థాయి కార్యక్రమ నిర్వహణను సమన్వయకం చేసుకునేందుకు మండల స్థాయిలో రెండు కమిటీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు ప్రతిరోజూ కార్యక్రమం జరుగుతున్న గ్రామాన్ని సందర్శించి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సహా ఇతర కార్యకర్తలు, కమిటీ మెంబర్లు సమక్షంలో ప్రజలలోకి తీసుకొని వెళ్ళాలి అని పార్టీ కేడర్ కు దిశా నిర్దేశం చేశారు. అనంతరం 2024 ఉమ్మడి మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా లోని అన్ని నియోజకవర్గాల వైస్సార్సీపీ ఇంచార్జ్ లు, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ , రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల వైస్సార్సీపీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి





## జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్






(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 30)

పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ అధికారులకు తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో డిఆర్ఓ అధ్యక్షతన జరిగింది. పిజిఆర్ఎస్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. పోర్టల్ లో 50 అర్జీలను ఇంత వరకు సంబంధిత అధికారులు చూడకపోవడంపై ఆయన అసహనం వ్యక్తపరిచారు. సంబందిత శాఖాధికారులకు నోటీసులు జారీచేయాలన్నారు.పరిష్కరించిన అర్జీల పై సమగ్రంగా ఆడిటింగ్ చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు లిఖితపూర్వకంగా అధికారులకు వినతిపత్రాలను అందించారు. మా సమస్యలు పరిష్కరించాలంటూ అభ్యర్థించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి హామీ ఇచ్చారు. గడువులోగా అర్జీలు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. పెండింగ్‌లో లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పరిష్కరించిన తదుపరి వారికిచ్చే ధ్రువీకరణ పత్రం తెలుగులోనే ఉండాలన్నారు.అర్జీలకు సక్రమంగా సమాధానం ఇవ్వడం లేదని ఆయన చెప్పారు. పీజీఆర్ఎస్ అర్జీలపై నిర్లిప్తంగా ఉండరాదన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన పలు సూచనలు చేశారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ఐదు సంవత్సరాల వయసు నిండిన ప్రతి పిల్లవాడిని పాఠశాలలో జెర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర గౌడ్ అధికారులకు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లల వివరాల మేరకు జిల్లాలో 3వేల 3వందల 71 మంది ఐదు సంవత్సరాల వయసు నిండిన పిల్లలు ఉన్నారని, వారికి సంబంధించి వారి తల్లిదండ్రుల పేర్లను ఫోన్ నెంబర్లను సేకరించినట్లు ఆయన తెలియజేశారు. జిల్లాలో ఐసిడిఎస్, ఎస్సీ, ఎస్టీ, బిసి,రెవెన్యూ డివిజన్ అధికారులు, ఎంపీడీవోలు మరియు తహసిల్దార్లు సమన్వయంతో పని చేస్తూ ఈ పిల్లలందరినీ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకుగాను, వారి తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల గురించి, ప్రభుత్వం అందించే పథకాల గురించి వారికి అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. అధికారులు 3371 మంది ఐదు సంవత్సరాల వయసు దాటిన పిల్లలు ఏ పాఠశాలలో చేరారో సంబంధిత వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఆర్టిజిఎస్ లో భాగంగా జిల్లాలోని ప్రతి శాఖలో జరిగే కార్యకలాపాలను వెబ్సైట్లో నమోదు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర గౌడ్ అధికారులకు తెలిపారు. రాష్ట్ర పరిపాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ నూతన ప్రక్రియలో భాగంగా జిల్లాస్థాయిలో ప్రతి కార్యాలయంలో నిర్వహించే ప్రతి కార్యక్రమాలను, ఆ శాఖ యొక్క ప్రభుత్వ ఉత్తర్వులు, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహించే పనులకు సంబంధించి తీసుకునే నిర్ణయాలు, ఉత్తర్వుల నకళ్ళను ఈపీటీఎస్.ఏపీ.జీవోవి.ఇన్‌లో నమోదు చేయాలన్నారు. వారానికి ఒక లక్ష డాక్యుమెంట్లను ఈ వెబ్సైట్లో నమోదుకు లక్ష్యాలను నిర్దేశించారని తెలిపారు. డాక్యుమెంట్ల నమోదుపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, జిల్లాల నమోదులపై సమావేశాలు నిర్వహిస్తారని, అందుకు సంబంధించి జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పి డి శ్రీనివాసరావు, సర్వ శిక్షఅభియాన్ అధికారి నాగిరెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించాలి

### ఆదాని ఒప్పందాన్ని రద్దు పరచాలి

### స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిరసిస్తూ విద్యుత్ భవన్ వద్ద సిపిఎం ధర్నా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)



వినియోగదారులకు ఉరితాడుగా పరిణమించే విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని సిపిఎమ్ డిమాండ్ చేసింది. సోమవారం నాడు సిపిఎం ఒంగోలు నగర కమిటి ఆధ్వర్యంలో స్థానిక రాంనగర్ లోని విద్యుత్ భవన్ వద్ద స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు.పార్టీ నగర కమిటీ సభ్యులు జి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి దరఖాస్తు చేయకుండానే, ప్రజామోదం లేకుండానే గత ప్రభుత్వం అదానితో కుదుర్చుకున్న లోపాయికారి ఒప్పందం ప్రకారం పాత మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విమర్శించారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి బాదుడే బాదుడు పేరుతో లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని ప్రజలను రెచ్చగొట్టి, ప్రస్తుత మంత్రి పయ్యావుల కేశవ్, చంద్రమోహన్ రెడ్డి జగన్ ప్రభుత్వం పై కేసు పెట్టి, నేడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటును సమర్ధించడం సిగ్గుచేటు అని విమర్శించారు. మోడీ ప్రభుత్వం 2023విద్యుత్ చట్టాలకు అనుగుణంగా రాష్టాలు కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేసుకునే వీలున్నప్పటికీ చంద్రబాబు రద్దు కుదరదని బుకాయించడం సరికాదన్నారు. తమిళనాడు ప్రభుత్వం ఆదాని అగ్రిమెంట్ రద్దుచేసిందని, పశ్చిమ బెంగాల్ ప్రజలు ఎదురు తిరగటంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తామని ప్రకటించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడున్న పాత మీటర్లవల్ల వినియోగదారులకు ఎటువంటి సమస్యలూ తలెత్త లేదనీ, ఏ ఒక్కరూ మీటర్లు మార్చమని కోరలేదని, అయినా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. తాము ఎటువంటి విద్యుత్ భారాలు వేయమని టిడిపి ఎన్నికల్లో ప్రజలను నమ్మించి, అధికారం చేపట్టిన అనంతరం రూ 15 వేల కోట్ల మేర సర్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు మోపారని దుయ్యబట్టారు. మీటర్ల ఏర్పాటుకు డబ్బులు చెల్లించనవసరం లేదని నమ్మబలికి 93 నెలల కాలంలో సింగిల్ పేజ్ కు రూ 8927లు, త్రీ పేజ్ కు రూ 17,286 లు వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు బిల్లు వచ్చిన తర్వాత 15 రోజులు లోపు చెల్లించుకునే సదుపాయంతో పాటు అదనంగా మరో 15 రోజులు లో చెల్లింపు కు వెసులుబాటు ఉండగా. స్మార్ట్ మీటర్లు ప్రక్రియ లో ముందే రీ- చార్జి చేసుకోవాల్సి ఉందని, కనీసం రూ 500 లు రీ చార్జి చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. కాగా రోజులో నాలుగు భాగాలుగా విభజించి రాత్రి వేళలు, వేసవి కాలం, పగటి వేళ ఒక్కో రేటు అమలు చేయనున్నారని, ఈ ప్రక్రియ ద్వారా అదనంగా వినియోగదారుల నుంచి వసూలు చేసి ఆదాని కి దోచి పెట్టేందుకే ఈ చేసేందుకు ప్రణాళికలు రూపొంచినట్లు ఆరోపించారు. ప్రజలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో అన్ని రాజకీయ పార్టీలను ఐక్యం చేసి మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు, జి రమేష్ మాట్లాడుతూ మీటర్ల ఏర్పాటు కు యజమాని అనుమతి అవసరం అని, యజమానులు ఇళ్లల్లో లేని సమయాల్లో దొంగ చాటుగా మీటర్లు బిగిస్తున్నట్లు ఆరోపించారు. పార్టీ నగర కమిటి సభ్యులు టి మహేష్, జి ఆదిలక్ష్మి,సీనియర్ నాయకులు దామా శ్రీనివాసరావు, మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకస్తున్నారని పేర్కొన్నారు. నగరం లో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ముఖ్యమంత్రి కి లేఖ రాస్తూ పలువురు సంతకాలు పెట్టినట్లు తెలిపారు. అనంతరం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంతకాలు సేకరించిన లేఖను రాష్ట్ర ముఖ్యమంత్రి కి పంపించాలని విద్యుత్ ఎస్సీ కట్టా వెంకటేశ్వర్లు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి వి రావు, జి శేషయ్య , ఆర్ శ్రీనివాసరావు, సిహెచ్ రాంబాబు, టి భక్తసింగ్ రాజు, పీరు, భాను, భావనారాయణ, రామకృష్ణ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పెరయ్యా, తదితరులు పాల్గొన్నారు.



# 31వ వార్డులో ముచ్చటించిన తల్లికి వందనం కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 30)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి మార్కాపురం పట్టణంలోని 31వ వార్డులో తల్లికి వందనం లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మబడి వచ్చేదని ఇప్పుడు తల్లికి వందనం పథకంలో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్న అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల అకౌంట్లో డబ్బు జమ చేయడం జరిగిందని ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా వార్డులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఫ్లెక్సీకి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వార్డులో మహిళలు కేక్‌ను కట్ చేసి తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం నాయకులు, మహిళలు, తల్లికి వందనం లబ్ధిదారులు పాల్గొన్నారు.





## త్వరితగతిన భూసేకరణ పనులు పూర్తిచేసి నివేశన స్థలాలు అందజేస్తాం

### మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 30)

మండలంలోని మణికేశ్వరం గ్రామస్తులు సోమవారం విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయం చిలకలూరిపేటలో కలిశారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ముంపు గ్రామాలలో ఒకటైన తమ గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తో మాట్లాడి, భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేత కరిముల్లా, గ్రామస్తులు ఉన్నారు.

## సుపరిపాలనకు తొలి ఏడాది కరపత్రాలు ఆవిష్కరణ

ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికి తెలియజేయాలి
పార్టీ శ్రేణులకు పిలుపిచ్చిన వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జూన్ 30)

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సుపరిపాలనకు తొలి ఏడాది కరపత్రాలను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా ఒక్క యర్రగొండపాలెం నియోజకవర్గంలో 125 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులను చేపట్టామని త్వరలోనే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చెప్పడతామని ఎరిక్షన్ బాబు గారు తెలిపారు. తొలి ఏడాదిలో నియోజక`వర్గంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమన్ని ఇంటింటికి చేర వేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల పోరాటంపై కుట్రలు చేస్తున్నారు

### ఏపీ ఫిషర్ మెన్ జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 30)




ఈపూరుపాలెం స్ట్రైట్ కట్ సిమౌత్ కబ్జా చేసిన సముద్ర దొంగలు గల్లా రామచంద్రరావు, బుర్ల వెంకట్రావు అక్రమాలపై మత్స్యకారులు పోరాడుతుంటే, మీడియాలో ఒక వర్గాన్ని ప్రలోభ పరచుకుని మత్స్యకారుల పోరాటంపై విష ప్రచారం చేస్తూ, విచారణను తప్పుదారి పట్టిస్తున్నారు అంటూ ఆంధ్రప్రదేశ్ ఫిషర్ మెన్ జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మత్స్యకారులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు మీడియా సమావేశం నిర్వహించారు. మత్స్యకారుల పోరాటంపై స్పందించిన జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఒకవైపు కమిటీని నియమించి విచారణ జరుపుతుంటే, సముద్ర తీరాన ఆక్రమించిన బుర్ల వెంకటరావు గల్లా రామచంద్రరావులు స్థానిక మీడియా ప్రతినిధులను, వివిధ రాజకీయ పార్టీల నాయకులను ప్రలోభ పెట్టి మత్స్యకారులపై తప్పుడు ప్రచారం చేస్తూ మానసికంగా దాడి చేస్తున్నారని మత్స్యకారులు ఆరోపించారు. బుర్ల వెంకట్రావు, గల్లా రామచంద్ర వాళ్ళ మధ్య బాపట్ల రిజిస్టర్ కార్యాలయంలో చేసుకున్న రిజిస్టర్ డాక్యుమెంట్లను మీడియా ముందు ప్రదర్శిస్తూ సముద్ర తీరంలో శ్రీ భ్రమర ఇన్ఫ్రా పేరుతో రియల్ ఎస్టేట్ వెంచర్లు, రిసార్ట్స్ నిర్మాణానికి పెద్ద ఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారని రాజశేఖర్ ఆరోపించారు.

కోస్టల్ రెగ్యులేషన్ జోన్ జిల్లా స్థాయి కమిటీ మెంబర్ ఎరిపిల్లి రమణ మాట్లాడుతూ జీవన పోరాటం చేస్తున్న మత్స్యకారులపై కొన్ని మీడియా ఛానల్స్ సముద్ర దొంగలను కొమ్ముగాసి విష ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి అధికార ప్రతిపక్ష పార్టీలు కనీసం మద్దతు ప్రకటించకపోగా మత్స్యకారులను అవమానపరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని సిపిఐ నాయకులు తన్నీరు సింగరకొండ, సిపిఎం నాయకులు ఎన్.బాబురావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పిక్కి శామ్యూల్, సున్నపు పోలయ్య, పిరాది సూరిబాబు, సిహెచ్ కనకరాజు, పిక్కి డేవిడ్, ప్రజా సంఘాల నాయకులు గుదే రాజారావు, కాగిత కోటేశ్వరరావు, రాష్ట్ర చేనేత జన సమాఖ్య ప్రతినిధులు దేవన వీర నాగశ్వరరావు, గుంటూరు మల్లికార్జున్, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రికార్డు అసిస్టెంట్ పాలడుగు రత్తమ్మ పదవీ విరమణ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 30)
మండల కేంద్రమైన ఉలవపాడు జీవీఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పాలడుగు రత్తమ్మ రిటైర్మెంట్ వేడుక సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల



ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు, అధ్యాపకులు గారపాటి గోపీ చంద్ ప్రకాష్, జ్యోతి, రఫీ, గంగాభవాని, హనుమంతరావు, సుబ్బాచారి, శ్రీనివాసులు, సుభాషిణి, మాధవరెడ్డి, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, వల్లూరయ్య అధ్యాపకేతర సిబ్బంది రాజు, అరవింద్ రత్తమ్మ తమ 28 సంవత్సరాల సర్వీస్ లో చేసిన సేవలను కొనియాడారు. గతంలో ఇదే కళాశాలలో ప్రిన్సిపాళ్లుగా పనిచేసిన నరసింహం, శంకరరెడ్డి, సయ్యద్ జిలానీ భాషా రత్తమ్మ సేవలను కొనియాడారు. హైస్కూల్ హెడ్ మిస్ట్రెస్ వెంకట రత్నం ఈ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

## ట్రాన్స్ఫార్మర్ దొంగల అరెస్ట్

**305 కిలోల కాపర్, 200 మీటర్ల కేబుల్ వైర్ స్వాధీనం**

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్**





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 30)
సుమారు 67 ట్రాన్స్ ఫార్మర్స్ దొంగతనాల్లో చోరికి పాల్పడిన 5 గురిని అరెస్టు చేసి 206 కిలోల కాపర్, రెండు వందల మీటర్ల కేబుల్ వైర్ ను స్వాధీనం చేసుకున్నట్లు గురజాల డిఎస్పి బి జగదీష్ తెలిపారు. సోమవారం సాయంత్రం రూరల్ సర్కిల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదివారం మధ్యాహ్నం వెల్దుర్తి ఎస్ ఐ సమందర్ వలి, సిబ్బందికి రాబడిన సమాచారంతో శిరిగిరిపాడు ఫారెస్టు చెక్పోస్టు వద్దకు వెళ్ళినట్లు తెలిపారు. పోలీసు వాహనాన్ని గమనించిన దొంగలు పరారు అవుతుండగా ఎస్ఐ తన సిబ్బందితో వారిని చుట్టుముట్టి మధ్యవర్తుల సమక్షంలో విచారించగా వారు వివిధ గ్రామాల్లో అర్ధరాత్రి సమయంలో పొలాల్లో ఎవరు లేని సమయంలో ట్రాన్స్ ఫార్మర్స్ పైభాగాన్ని తోలగించి వాటిలోని రాగి వైరు, కేబుల్ను దొంగిలించి పలువురు స్క్రాప్ కొనుగోలుదారులకు అమ్ముకొని జీవిస్తున్నట్లు తెలిపారు, వీరంతా ఒంగోలుకు చెందిన మొగిలి నాగరాజు, గడ్డం బయ్యన్న, ప్రతాప్ లక్ష్మీ, దారల భవాని, దేవర అంజమ్మలగా గుర్తించినట్లు తెలిపారు. వారి వద్ద నుండి రూ 50వేలు విలువ చేసే కేబుల్ వైరు, రూ 2,69,620 విలువ చేసే 308 పేజీల కాపర్ను రికవర్ చేసినట్లు తెలిపారు. వీరు మొత్తం 10 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారూ. వీరు గతంలో కూడ ఇటువంటి దొంగతనాల్లో పాల్గొనగా వారిపై కేసులు నమోదు అయినట్లు తెలిపారు. వెల్దుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో 13 ట్రాన్స్ ఫార్మర్స్, మాచర్ల టౌన్లో 1, మాచర్ల రూరల్లో 7, దుర్గిలో 17, కారంపూడిలో 4, విజయపురిసౌత్లో 15, ప్రకాశం జిల్లాకు చెందిన పుల్లల చెరువులో 7, యర్రగొండపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో 3 ట్రాన్స్ ఫార్మర్లను వీరు దొంగిలించినట్లు తెలిపారు. కాపర్, కేబుల్ వైరు కొనుగోలు చేసిన రిసివర్ను కూడ కేసుల్లో పెట్టినట్లు తెలిపారు. వారు పరరిలో ఉన్నట్లు తెలిపారు. గతంలో బంగారు గొలుసుల దొంగతనాల్లో కూడ ఇరువురు రిసీవర్స్ గుర్తించినట్లు తెలిపారు. వారు కూడ పరారిలో ఉన్నట్లు తెలిపారు. దొంగతనాల్లో నిందితులను పట్టుకుని, రికవరీలో పాల్గోన్న ఎస్ ఐ, సిబ్బందిని అభినందించి, వారికి రివార్డు అందేలా సిఫార్స్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అర్బన్ సిఐ సి ప్రభాకరరావు, రూరల్ సీఐ సఫీజ్ బాషా, ఎస్ ఐ సంధ్యారాణి. ఆశోక్, సిబ్బంది దేవర నాయర్, విజయ్, వెంకటనాయక్, తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)
లేబర్ కోడ్స్ రద్దు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం... ? "దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి. ఒంగోలులో మల్లయ్య లింగం భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక సమావేశం జరిగింది. సమావేశానికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు అధ్యక్షత న జరిగింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికులను కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ తెచ్చింది. వీటిని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తింపు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయరాదని, పెన్షన్, ఉపాధి భద్రత కల్పించాలని జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, శ్రామికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ 4 లేబర్ కోడ్స్ రద్దుచేయాలి. కార్మికులందరికి కనీసవేతనం 26 వేలు ఇవ్వాలి.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ రద్దు చేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. . స్కీంవర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలి. కనీస పెన్షన్ రూ. 10 వేలు ఇవ్వాలి. విశాఖ స్టీల్, ప్రభుత్వరంగ సంస్థల ప్రవేటీకరణ ఆపాలి. . బిల్డింగ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి, ముఠా, ఆటో, రవాణా ఇతర అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటుచేయాలి. పి.యఫ్, ఇ.యస్.ఐ. అమలుచేయాలి.. గిగ్ వర్కర్స్, ప్రైవేట్ విద్యాసంస్థలు, హాస్పటల్స్, షాపింగ్ మాల్స్లో పనిచేసే వారందరికి కార్మిక చట్టాలు, కనీస వేతనాలు అమలు చేయాలి. . పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. ఇ.పి.యస్. కనీస పెన్షన్ రూ. వేలు ఇవ్వాలి, 9, జిల్లాలో సంక్షోభంలో ఉన్న గ్రానైట్, డిజైన్లైట్, ఇతర పరిశ్రమలకు రాయితీలు ఇవ్వాలి. కార్మికుల ఉపాధికి భద్రత కల్పించాలి. 1, కనిగిరి నిమ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్ లలో పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి. . స్వామినాథన్ కమీషన్ సిఫార్సులకు అనుగుణంగా పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించాలి. 1. అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని పునరుద్ధరించాలి. జిల్లాలో ఇ.ఎస్.ఐ. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వరంగ సంస్థలలో ఖాళీలను భర్తీ చేయాలి. ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పని, రోజుకి రూ.600 కనీసవేతనం ఇవ్వాలి. ఉపాధిహామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించాలి.రైతు సంఘం జిల్లా కార్య ద ర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన 22 సమ్మెలకు ఈ సమ్మెకు చాలా వ్యత్యాసం ఉంది. ఇతర డిమాండ్లు ఉన్నా అన్నింటిలోనూ లేబర్ కోడ్లను అడ్డుకోవడం ప్రధాన అంశం. లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే



చట్టాలు వర్తించే కార్మికులు, చట్టాలు వర్తించని కార్మికులు అందరూ బానిసలుగా మారిపోతారు. లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుంది. గత 10 సంఎఎల నుంచే అనేక కార్మిక చట్టాలు నిర్వీర్యం చేస్తున్నారు. చెన్నైలోని 'సామ్ సంగ్' కంపెనీలో కార్మికులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న యూనియన్ను రిజిస్టర్ చేయకుండా యాజమాన్యం, ప్రభుత్వం అడ్డుకోవడం దానిలో భాగమే. లేబర్ కోడ్స్లో అత్యంత ప్రమాదకరమైంది సమ్మెహక్కును రద్దు చేయడం, . సమ్మె చేస్తే చట్ట వ్యతిరేక సమ్మె అవుతుంది. చట్ట వ్యతిరేక సమ్మె చేస్తే కార్మికులకు ఒకరోజు సమ్మెకు 8 రోజుల జీతం కోత విధిస్తారు. నాయకులను జైలులో పెట్టి నిర్బంధించవచ్చు. యూనియన్ రిజిస్ట్రేషన్, గుర్తింపు రెండూ రద్దు చేయవచ్చు. లక్షలు జరిమానా విధించవచ్చు. ఇప్పటివరకు పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చెల్లించని యాజమాన్యాలకు జైలు శిక్ష ఉండటంతో దానికి భయపడి కట్టేవారు. బెయిల్ రావాలంటే కూడా 50% చెల్లించాలి. కానీ లేబర్ కోడ్స్లో యజమానులపై ఈ శిక్షలు ఎత్తివేశారు. ఇవే కాకుండా ఇతర కార్మిక చట్టాలు, క్రిమినల్ చట్టాల్లో ఉన్న 180 రకాలు శిక్షలు ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం "జనవిశ్వాస్" అనే చట్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తనిఖీలు పద్ధతిని ఎత్తివేశారు. తనిఖీలు లేకుండా ఏ చట్టం అమలు కాదు. కంపెనీలు మూసివేయడం, లాకౌట్ చేయడం, లే ఆఫ్ చేయడానికి పార్లమెంట్లోనే చట్టాలు మార్చాలి. కానీ లేబర్ కోడ్స్ ద్వారా రాష్ట్రాలకు ఇష్టం వచ్చినట్లు మార్చే అధికారాలు వచ్చాయి. రైతు కూలీ సంగం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో లేబర్ కోడ్స్ రాకుండానే చంద్రబాబునాయుడు ప్రభుత్వం స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నది. అనేక సంవత్సరాల నుంచి రాష్ట్రంలో ప్రభుత్వాలు కనీస వేతనాలు రూపాయి కూడా పెంచలేదు. లేబర్ కోడ్స్ వస్తే ఇప్పుడున్న అన్ని చట్టాలు పోయినట్లే. అందుకే జులై 9న సమ్మెకు ఎంతో ప్రాధాన్యత ఉంది. లేబర్ కోడ్స్ వల్ల పని ప్రదేశంలో కార్మికులకు రక్షణ, ఆరోగ్య భద్రత, పనిగంటలు, వారాంతపు సెలవులు, లీవులు తదితర హక్కులు కోల్పోతారు. కొత్తగా పెట్టే ఫ్యాక్టరీలలో తాము అనుకున్నంత కాలం కార్మిక చట్టాలు అమలుకాకుండా నిరోధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి వస్తుంది. కార్మిక హక్కులపై ఇది గొడ్డలి పెట్టు. ఈపీఎఫ్ 12 నుండి 10 శాతానికి తగ్గుతుంది. ఈపీఎఫ్ బదులుగా కొత్త పెన్షన్ స్కీంను ప్రవేశపెట్టి కార్మికుల డబ్బు రూ.8 లక్షల కోట్లను జూదపూరిత షేర్ మార్కెట్కు తరలిస్తారు. అనేక రకాల బెనిఫిట్స్ను అందించే ఈఎస్ఐ కు ప్రత్యామ్నాయంగా కేవలం మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం తీసుకువచ్చి ఈఎస్ఐ ను నిర్వీర్యం చేస్తారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం విద్యుత్తు, రవాణా, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలికం, స్టీలు, పోర్ట్స్, ఎయిర్ లైన్స్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తుంది. విశాఖ స్టీలు ప్రైవేటుపరం కాకుండా కార్మికులు అడ్డుకుంటున్నారు. ప్రైవేటీకరణ వలన కార్మికులు ప్రజలపై మరింత భారం పడుతుంది. ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి పోతే ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతాయి. 15వ కార్మిక మహాసభ సిఫార్సులు, 1992 సుప్రీంకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకొని కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. భారత కార్మిక మహాసభ సిఫార్సులకు అనుగుణంగా స్కీం వర్కర్లయిన అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం, వి.ఓ.ఎ., యస్.యస్.ఎ. వారిని వర్కర్లుగా గుర్తించి కనీస వేతనాలు, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలి. ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయల ఆదాయం తీసుకు వస్తున్న ఆక్వా పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు చట్టాలు కనీస వేతనాలు అమలు కాకున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. చట్టం ప్రకారం పర్మినెంట్ కార్మికులు చేసే పని కాంట్రాక్ట్ కార్మికులు చేస్తే వారికి పర్మినెంట్ కార్మికుల వేతనాలు, అలవెన్స్, బెనిఫిట్లు ఇవ్వాలి. సుప్రీంకోర్టు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు చెప్పింది. కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న లక్షలాదిమంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్లించి బోర్డును నిర్వీర్యం చేస్తున్నారు. బిల్డింగ్ కార్మికులు సంక్షేమ బోర్డులను పునరుద్ధరించాలి. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన బిల్డింగ్ కార్మికుల సంక్షేమ నిధిని తిరిగి జమ చేయాలి. ముఠా, రవాణా, గిగ్, షాపింగ్ మాల్స్, హాస్పిటల్, ఫ్రూట్ వెండర్స్ కార్మికులకు కొత్తగా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలి. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి. ఈపిఎస్ కనీస పెన్షన్ రూ.9వేలకి పెంచాలి. జిల్లాలో సంక్షోభంలో కూరుకుపోయిన గ్రానైట్, డిజైన్ స్లేట్ పరిశ్రమలకు రాయితీలు ఇవ్వాలి. కనిగిరి నిమ్స్, దొనకొండ పారిశ్రామిక కారిడార్లో పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ జులై 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, ఉద్యోగులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతున్నాము.ఈ సమావేశం లో పి. హనుమంతరావు, పద్మ, చుంచు శేషయ్య, సుబ్బారావు, ఎంఎస్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఈవ్ టీజర్లు, బైక్ రేసర్ల పై స్పెషల్ డ్రైవ్ 33 బైకులు సీజ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)
ఈవ్‌టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడే వారి పై జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టాలనే ఉద్దేశ్యంతో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఒంగోలు 1టౌన్ పరిధిలో ముఖ్యమైన కూడలిలు, కళాశాలలు, పాఠశాలలు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఈవ్ టీజింగ్ చేస్తున్న 60 మంది యువకులను గుర్తించి వారికి ఒంగోలు 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. 33 బైక్ లను సీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ యువతులు, మహిళలపై ఈవ్ టీజింగ్ అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. ఈవ్ టీజింగ్ కేవలం సరదాగా చేసే చర్య కాదని, వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉంటుందన్నారు. మహిళలు, విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వెంబడించడం, అసహజ వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన యువకులకు దాని పర్యవసానాల గురించి, భవిష్యత్తులో ఎలాంటి ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయో కూడా వారికి వివరించారు. ఈవ్ టీజింగ్ చట్టరీత్యా నేరమని ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. యువతరం బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. మహిళల పట్ల గౌరవంతో వ్యవహరించడం, వారి హక్కులను గుర్తించడం అనేది ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఈవ్ టీజింగ్ వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు. రాత్రి సమయంలో కొంతమంది ఆకతాయిలు మాడిఫైడ్ సైలెన్సర్లతో అధిక శబ్దం చేస్తూ టౌన్ లో తిరుగుతున్నారని వారిపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, 1 టౌన్ సిఐ నాగరాజు, ఎస్ఐలు సాంబశివరావు, సందీప్, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.





# ఏడాదిలోనే ఇంటింటికీ పథకాలు, ప్రతిఒక్కరికీ ప్రయోజనాలు

**ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

**నేడు వినుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమావేశం**

**జులై 2 నుంచి ప్రభుత్వ విజయాల పై క్షేత్రస్థాయిలో ప్రచారం పై దిశానిర్దేశం**



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 30)
రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఇంటింటికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ప్రతిఒక్కరికీ ఏదొక రూపంలో ప్రయోజనం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిది అన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఇదే విషయంలో జులై 2 నుంచి నియోజకవర్గం మొత్తం విస్తృత ప్రచారం నిర్వహించబోతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వ తొలి ఏడాది విజయాలు తెలియజేయడంతో పాటు ప్రజల్లోకి వెళ్లి, వారి సమస్యలను అర్థం చేసుకుని చేసిన మంచిని వివరించడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. అందుకే ఈ కార్యక్రమం విజయవంతం కావడం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఇందుకు సంబంధించి మంగళవారం వినుకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జులై రెండో తేదీ నుంచి నిర్వహించనున్న 'సుపరిపాలనలో తొలిఅడుగు – ఇంటింటికి తెలుగుదేశం' ప్రచారంపై జీవీ ఆంజనేయులు దిశానిర్దేశం చేయనున్నారని వెల్లడించారు. ఈ సమావేశానికి అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, క్లసర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, గ్రామ నూతన కమిటీల అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. పార్టీ భవిష్యత్తు కార్యచరణపై ప్రధానంగా చర్చించనున్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కమిటీల ఏర్పాటు, మూడు పార్టీల సమన్వయంపై చర్చించి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. నెల రోజుల పాటు సుపరిపాలనలో తొలిఅడుగు – ఇంటింటికి తెలుగుదేశం' డోర్ టూ డోర్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై దిశానిర్దేశం చేస్తారని వివరించారు. పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పన, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని, ఈ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం అద్భుత అవకాశంగా ఉంటుందని తెలిపారు.

# పేదలు నివసించే ప్రాంతంలోని స్కూళ్లను విలీనం చేయడం ఆపాలి






**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 30)**

హనుమంతునిపాడులో రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా వ్యవస్థలో భాగంగా పాఠశాలల విలీన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఇందులో పేదలు దళితులు నివసించే ప్రాంతంలో స్కూళ్లను ఇతర పాఠశాలలో విలీనం చేయడాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు. హనుమంతుని పాడు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఈరోజు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా విధానంలో పలు మార్పులు చేస్తుందని అందులో భాగంగా మూడవ తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులను ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాలలన్నీ కలిపి ఒకే పాఠశాల పరిధిలోకి తీసుకువచ్చి మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయుటకు పూనుకున్నాదని తెలిపారు అయితే ఈ విలీనంలో భాగంగా స్థానిక తల్లిదండ్రులు విద్యా కమిటీ చైర్మన్లు వాళ్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్న నిర్ణయాన్ని అమలు చేయటం లేదన్నారు ఇదే క్రమంలో విద్యార్థులకు విలీనం చేసే పాఠశాల వరకు రాకపోకలకు ఎలాంటి ఆంతరాయం లేనటువంటి పరిస్థితులను పాఠశాలలను పరిగణలోకి తీసుకుని వీలైనం చేయాలని తెలిపారు. హనుమంతునిపాడు మండలంలో 15 పాఠశాలల విలీన కార్యక్రమం చేపట్టగా ఇందులో 12 పాఠశాలలు దళితులు నివసించే ప్రాంతంలో ఉన్నాయన్నారు. ఈ పాఠశాలలు విలీనం చేయడం ద్వారా దళిత విద్యార్థులు భవిష్యత్తులో విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తపరిచారు. ప్రభుత్వం నూతన విద్యా విధానం అంటే మెరుగైన వసతులు సౌకర్యాలు ప్రతి స్కూలుకు ప్రతి తరగతికి ఒక టీచరు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు చుట్టూ ప్రహరీ పౌష్టికాహారం అలాంటి అంశాలను పరిశీలించకుండా కేవలం స్కూళ్లను విలీనం చేసి భవిష్యత్తులో దళితవాడల్లో పాఠశాల లేకుండా చేసే చర్యలకు పూనుకున్నదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు తక్షణమే విలీన కార్యక్రమానికి ఉన్నతాధికారులు పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంగంపల్లి స్కూలును నందనవనంలో విలీనం చేస్తున్నారని మంగంపల్లి నుండి రెండు కిలోమీటర్లు పైబడి స్కూల్ విద్యార్థులు ప్రతిరోజు నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని మార్గమధ్యలో రెండు చెరువు అలుగువాగులు చెరువు కట్ట దాటుకొని పోవాల్సిందని కోతులు అడవి జంతువులు కుక్కలు విష సర్పాలు నిరంతరం సంచరిస్తుంటాయని ఇలాంటి ప్రమాదకర పరిస్థితిలో విద్యార్థులను విలీనం చేసి వారి విద్య తోటి వారి జీవితాలతో ఆడుకోవడం సబబు కాదని తెలిపారు. ముప్పళ్లపాడు పరిధిలోని మూడు గ్రామాలు, కూటగుండ్ల,రసీదుపురం తాళ్లవారిపల్లి ముసలంపల్లి గ్రామాలలో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు ముప్పలపాడు నుండి పెదముప్పలపాడు ముప్పలపాడు మాదిగ పాలెం విరగారెడ్డిపల్లి మూడు స్కూళ్లను హైస్కూల్లో విలీనం చేసే కార్యక్రమం చేపట్టారని పెదముప్పలపాడు నుండి రావాలంటే చెరువు అలుగు వాగు మరుసవాగులు దాటుకొని రావాలని ఇరగ రెడ్డి పల్లి నుండి రావాలన్నా పెద్ద వాగు దాటాలని మాదిగ పాలెం పిల్లలు రావాలంటే మూడు వాగులు తో ప్రవహించే ప్రమాదకరమైన పెద్దవాగు దాటి రావాలని సుమారు రెండు కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని తెలిపారు ప్రభుత్వ ఉన్నత అధికారులు వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించి నిర్ణయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేసే నిర్ణయం ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలని ప్రజలను ఇబ్బంది పెట్టే పరిస్తితులకు తావివ్వకూడదని తెలిపారు ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమం కొనసాగింపు చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎంఈఓ కార్యాలయంలో సంబంధిత అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంద్రా వినయ్ గురునాథం, రాములు ,విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు నందా గరటయ్య దేవరాజు గట్టు ,మల్లికార్జున్, రావినూతల, బాలయ్య పరిస్థితి ,అనిల్ వేలూరి, వెంకటేశ్వర రెడ్డి ,శ్రీనివాసరెడ్డి ,మరిచిపోకు కమలాకర్ ,మర్చిపోకు ప్రభాకర్, పాప బత్తిని, పురుషోత్తం గూడూరి దానేలు, ప్రేమయ్య సాల్మన్ రాజు, సుందర్రావు, గురవయ్య, ఈసాకు, కత్తి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## అలగాయపాలెం గ్రామంలో పల్లె నిద్ర





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 30)**

రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్ కె. మస్తాన్ షరీఫ్, కానిస్టేబుల్ పి.రాజేష్‌తో కలసి సోమవారం అలగాయపాలెం గ్రామంలో నైట్ ఆల్ట్(పల్లె నిద్ర) చేసి గ్రామ కాపులతో, గ్రామ ప్రజలతో సమావేశం అయ్యారు. సముద్ర తీర ప్రాంత గ్రామాలలో కొత్త వ్యక్తుల కదలికలు గమనిస్తూ ఉండాలని, అనుమానాస్పద సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్.1093 కి అదేవిధంగా రామాయపట్నం సిఎస్ పిఎస్‌కి తెలియచేయాలి అని తెలపడమైనది. దేశ భద్రత దృష్ట్యా సముద్రం మార్గం ద్వారా మన దేశంలోకి టెర్రరిస్టులు, ఉగ్రవాదుల వంటి యాంటీ నేషనల్ ఎలిమెంట్స్ ప్రవేశించకుండా, అక్రమ రవాణా, స్మగ్లింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా నివారించడానికి, మత్స్యకారులు కో స్టల్ సెక్యూరిటీ పోలీస్ వారికి సహకరించాలని, కోస్టల్ సెక్యూరిటీ పటిష్టంగా ఉండటం వలన దేశం కూడా పటిష్ఠంగా ఉంటుందని తెలిపారు.

## పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ పక్కాగా ఉండాలి

**బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ పై పోలీస్ అధికారులతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సమీక్ష**



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 30)**

ఏటా కన్నులపండువగా జరిగే వినుకొండ తొలిఏకాదశి తిరునాళ్ల ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావు ఇవ్వొద్దని, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు . భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్ని ముందుజాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. మరీ ముఖ్యంగా తిరునాళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక రూపొందించి పటిష్టంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు మార్గనిర్దేశం చేశారు. జులై 6న కొండ పండుగ పురస్కరించుకొని వినుకొండలోని తన కార్యాలయంలో వినుకొండ తిరునాళ్ల బందోబస్తు ఏర్పాట్లపై సోమవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, వినుకొండ పట్టణ, గ్రామీణ సీఐలు శోభన్ బాబు, ప్రభాకర్, ఎస్సైలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ కొండపైన దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మొహరం, తొలి ఏకాదశి ఒకేసారి వచ్చినందున సున్నితమైన అంశంపై పోలీ సులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతేడాది జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని మరిం త జాగ్రత్తలతో వ్యవహరించాలని తెలిపారు. పైగా మొహరం, తొలి ఏకాదశి ఒకేసారి వచ్చినందున సున్నితమైన అంశంపై పోలీ సులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదే సమయంలో ప్రధాన కూడళ్లలో భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలు పరిశీలించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని చెప్పారు చీఫ్‌విప్ జీవీ. సాధారణ భక్తులు స్వామిని దర్శించుకునేలా క్యూలైన్లు, బారికేడ్ల వద్ద సిబ్బందిని కేటాయించాలన్నారు. ప్రభల వద్ద గొడవలు జరగకుండా, ఆర్కెస్ట్రా వ్యవహారాలపై కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యం

**యాగంటి మల్లికార్జునరావు**



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 30)**

విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమని మాచర్ల మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు అన్నారు. సోమవారం మాచర్ల పట్టణం నెహ్రూ నగర్ ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం గాదే కిరీట్‌రెడ్డి ఉద్యోగ విరమణ వేడుకకు ముఖ్య అతిథిగా మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కిరిట్‌రెడ్డి ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసి విద్యార్థినీ, విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తరఫున అందిస్తున్న స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా లోకేష్ వైసీపీ ప్రభుత్వంలో నిర్వీరమైన విద్యారంగాన్ని అభివృద్ధి బాటలో పట్టిస్తూ స్కూల్స్ మరియు కాలేజీలకు మౌలిక వసతులు కల్పించి విద్యా రంగా అభివృద్ధికి నూతన నాంది పలికారు. తెలుగుదేశం పార్టీ యువ నాయకులు యువగళం రథసారధి నారా లోకేష్ బాబు అని కొనియాడారు.ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థి విద్యార్థులకు స్కూల్స్ ఓపెనింగ్ రోజే పాఠ్యపుస్తకాలు మరియు బ్యాగ్స్ అందించిన ఘనత నారా లోకేష్ బాబు కి చెందిందని వెల్లడించారు.

విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరూ చదవాలి అనేది మన కూటమి ప్రభుత్వ లక్ష్యం అని వెల్లడించారు.తల్లికి వందనం పథకం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుట్టాం. చంద్రబాబు సూపర్ సిక్స్ లో ప్రధానమైన హామీ తల్లికి వందనం. ఈ తల్లికి వందనం ద్వారా 8,745 కోట్ల రూపాయలను 67,27,000 విద్యార్థుల తల్లుల అకౌంట్లలో జమచేయడం జరిగింది.అర్హులు ఎంతమంది ఉన్నా సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని వెల్లడించారు. ప్రభుత్వ స్కూల్ మరియు జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థి విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా సన్న బియ్యంతో రుచికరమైన భోజనం అందిస్తున్న ఘనత దేశం మొత్తం మీద ఒక్క నారా లోకేష్ బాబు మాత్రమే అని వెల్లడించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామం దగ్గర కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సెంట్రల్ స్కూల్ ఏర్పాటు కాబోతుంది అని వెల్లడించారు. జూలై 5న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పెట్టబోతున్నాం. ఆ సమావేశంలో తల్లిని ఎలా గౌరవించాలి, ఎలా ఆశీర్వాదం తీసుకోవాలో నేర్పించేలా చర్యలు తీసుకుంటాం. సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. సమాజంలో మహిళ గౌరవాన్ని నిలబెట్టడమే లక్ష్యంగా మన కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని యాగంటి మల్లికార్జునరావు వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. ఏడాదిలో రూ.34 వేల కోట్లు అందించాం. మత్స్యకార భరోసా కింద రూ.250 కోట్లు ఇచ్చాం.దీపం-2 పథకం కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. 16,347 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ కూడా ఇచ్చాం.ఎక్కడా పొరపాట్లు దొర్లకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 204 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5 రూ లకే పేదవాడి ఆకలి తీరుస్తున్నామని చెప్పారు. వచ్చే నెల కేంద్రం పీఎం కిసాన్ ఇస్తుంది. అదే రోజున రాష్ట్రం తరఫున అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు కూడా రైతులకు ఇస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. అర్చకులకు రూ.15 వేలు, నాయీ బ్రాహ్మణులకు రూ.15 వేలు, పాస్టర్లకు రూ.5వేలు, ఇమామ్ మౌజన్లకు రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తుంది మన కూటమి ప్రభుత్వమని యాగంటి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కెసిపి సిమెంట్ చీఫ్ జనరల్ మేనేజర్ రమణ, ఎలక్ట్రికల్ డీజీఎం రామకోటేశ్వరరావు, నూటన్స్ కాలేజీ కరస్పాండెంట్ జొన్న శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, బిజెపి నాయకులు నాసరయ్య, తిక్క కొండలు, దుర్భాగుల ప్రసాద్‌రావు, గోలి వెంకటేశ్వర్లు, స్కూల్ టీచర్స్, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

## చింతలపాటి లక్ష్మి నారాయణ ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమం










**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)**

40 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా వేలాది మంది విద్యార్థుల ను తీర్చి దిద్ది ఇంగ్లీష్ సబ్జెక్టు లో 100% పాస్ ట్రాక్ రికార్డు పొందిన చింతలపాటి లక్ష్మి నారాయణ ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమం పి.వి. ఆర్ మునిసిపల్ కార్పొరేషన్ బాయ్స్ హై స్కూల్ నందు ఘనంగా జరిగింది. పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మువ్వ రాధిక అధ్యక్షత వహించారు. ఈ సభలో ప్రధాన వక్తలు, యుటిఎఫ్ టీచర్ సంఘాలు మాట్లాడుతూ లక్ష్మీనారాయణ టీచర్స్ సమస్యలపై ముందుండి నడిచే వారని, సమస్యలు పరిష్కారం కూడా చేశారని, వక్తలు కొనియాడారు. ఇంకా వివిధ పాఠశాల హెచ్‌ఎం సన్మాన గ్రహీత ను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. యుటీఎఫ్ నాయకులు, సీపీఎం నాయకులు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు లక్ష్మి నారాయణని సన్మానించారు. పివిఆర్ బాయ్స్ హై స్కూల్ హెచ్‌ఎం, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## పీర్ల పండుగకు ఆహ్వానం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)**

ఈ నెల 6వ తేదీ ఆదివారం ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని తర్లపాడు మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో అత్యంత వైభవంగా, మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే పీర్ల పండగ (బడేశర్గత్) కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా, ఏపీసీసీ కేకేసీ చైర్మన్ కైపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్ర రత్న భవన్లో ఏపీసీసీ చీఫ్ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డిని ఆహ్వానించారు. స్థానిక నాయకులు తర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ షేక్ మహబూబ్ వలి తదితరులు పాల్గొన్నారు.





## నూతన డిటిపిఓగా బాధ్యతలు స్వీకరించిన డి సామ్రాజ్యం

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జూన్ 30)**



బాపట్ల జిల్లాకు నూతన డిటిపిఓగా డి సామ్రాజం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం డిటిపిఓ మాట్లాడుతూ బాపట్ల జిల్లా అభివృద్ధి పథంలో నడిచేలా కృషి చేస్తానని ప్రయాణికులకు సకల సౌకర్యాలు కల్పిస్తానని నూతన బస్సులు తెప్పిస్తామని ప్రయాణికులు ఎక్కడ ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తానని డిటిపిఓ డి సామ్రాజ్యం అన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా కార్డన్ సెర్చ్

### సరైన పత్రాలు లేని 29 ద్విచక్ర వాహనాలు స్వాధీనం







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 30)**

ప్రకాశం జిల్లా పోలీస్ శాఖ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో త్రిపురాంతకం సర్కిల్ పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి సోమవారం ఉదయం కురిచేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిజ్ఞపూరి కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో పోలీస్‌లు ఆయా ప్రాంతాల్లోని అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల ఇళ్లల్లో, గ్రామా శివారులు, ముఖ్యమైన కూడళ్లు, పలు షాప్‌లలో డ్రోన్ కెమెరాలతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో సరైన పత్రాలు లేని 29 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నేర నియంత్రణ, అసాంఘిక కార్యక్రమాల అడ్డుకట్టకి పోలీసు శాఖ నిర్వహించే కార్డన్, సెర్చ్ ఆపరేషన్‌కు ప్రజలు వంతు సహకారాన్ని అందించాలని పోలీసు అధికారులు కోరారు. వారి ప్రాంతంలో చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112, 100 కు తెలియజేయాలని కోరారు. ఈ కార్డన్, సెర్చ్‌లో త్రిపురాంతకం సీఐ అస్సన్, కురిచేడు ఎస్ఐ ఎం శివ, దొనకొండ ఎస్ఐ త్యాగరాజు, త్రిపురాంతకం ఎస్ఐ శివ బసవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివశక్తి ఆధ్వర్యంలో ఆసుపత్రికి మార్చురీ ఏసి అందజేత




**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 30)**

శివశక్తి లీల అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీ ఏసి బాక్స్,10 బల్లలు అందజేశారు. ఆసుపత్రి శవాగారంలో ఏసి బాక్స్ లేక శవాలను నిల్వ చేసేందుకు పడుతున్న ఇబ్బందులు, రోగులు కూర్చునేందుకు బల్లలు లేక పడే ఇబ్బందులను ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన మానవతా దృక్పథంతో స్పందించి ఆసుపత్రికి మార్చురీ ఏసీ బాక్స్, 10 బల్లలు శివశక్తి ఫౌండేషన్ ద్వారా అందజేయడం జరిగిందని ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో రోగుల కష్టాలను, ఇబ్బందులను గుర్తించి శివశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, ఆయన సతీమణి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి గారికి ఆసుపత్రి తరుపున డాక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. మానవసేవే మాధవసేవగా భావించి శివశక్తి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని టిడిపి నాయకులు పివి సురేష్ బాబు, ఆయుబ్ ఖాన్, జానీ భాష, పువ్వాడ కృష్ణ, తదితర నాయకులు కొనియాడారు. శివశక్తి ఫౌండేషన్ నుండి 25 ఏళ్లగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ నియోజవర్గంలో పేదలను ఆదుకోవడం జరిగిందన్నారు. ఆసుపత్రి విజిట్‌కు వచ్చిన చీఫ్ విప్ జీవి ఆంజనేయులుకి డాక్టర్లు వినతిపత్రం ఇవ్వటం వెంటనే స్పందించి శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఏసి బాక్స్, రోగులు కూర్చునేందుకు 10 సిమెంట్ బల్లలు బహుకరించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ రమేష్, ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్దాం

**సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేస్తాం**
**నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టోని కచ్చితంగా అమలు చేస్తా**
**ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం**
**సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి టిడిపి పై**
**సమీక్షా సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 30)**

ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కందుకూరు నియోజకవర్గం లో చేసిన అభివృద్ధి సంక్షేమంపై సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి టిడిపి జులై 2 వ తేదీ నుంచి జరగనున్న కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేయాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గారు పార్టీ నాయకులకు కార్యకర్తలకు తెలియజేశారు. కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం పై క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ మరియు పార్టీ నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే మరియు పార్టీ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ,యువ నాయకులు రాష్ట్ర మంత్రి నారా లోకేష్, జులై 2వ తేదీ నుంచి సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి కందుకూరు నియోజకవర్గం లో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు పార్టీ నాయకులు కార్యకర్తల తెలియజేయాలని, ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే గుర్తిస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేద్దామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు పార్టీ నాయకులకు కార్యకర్తలకు తెలియజేశారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కానీ ప్రతిపక్షం లో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక, లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో అత్యధిక సీట్లతో కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేశారని, వారి నమ్మకాన్ని నిలబెడుతూ పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సారధ్యంలో మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేస్తామని తెలియజేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం రద్దు చేసిన అనేక సంక్షేమ పథకాలను తిరిగి కొనసాగిస్తూ, ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం అమలు చేశామని, దీపం పథకం ద్వారా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని శ్రీకారం చుడుతున్నామని , త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి 20 వేల రూపాయలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గం లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చటానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, పట్టణ టిడిపి అధ్యక్షులు మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, షేక్ రఫీ వడ్డెళ్ళ రవిచంద్ర క్లస్టర్, యూనిట్ బూత్ మరియు అన్ని గ్రామ వార్డు అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






# కందుకూరు మున్సిపాలిటీ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

**రూ.1.25 కోట్లతో రోడ్డు వెడల్పు, డివైడర్ పనులకు శంకుస్థాపన**
**రూ.50 లక్షలతో నిర్మించిన మున్సిపల్ పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**











**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 30)**

కందుకూరు పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా సోమవారం సాయంత్రం రూ.1.25 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ విగ్రహం నుంచి పామూరు రోడ్ సర్కిల్ వరకు రెండు వైపులా రహదారి విస్తరణ, సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కందుకూరు మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో, మున్సిపల్ శాఖ మంత్రి శ్రీ డాక్టర్ పొంగూరు నారాయణ గారి సహకారంతో పట్టణ అభివృద్ధి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు... పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని త్వరలోనే నార్త్ బైపాస్ అందుబాటులోకి రానుందని ఎమ్మెల్యే తెలియజేశారు. పట్టణంలో జడ్పీ బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్ ఎదురుగా రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పార్కును ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన చిన్నపిల్లల ఆట పరికరాలను, వ్యాయామ పరికరాలను పరిశీలించిన ఎమ్మెల్యే , షటిల్ కోర్టులో పార్టీ నేతలతో కలిసి సరదాగా షటిల్ ఆడారు...పట్టణంలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడమే కాకుండా పచ్చదనం, ప్రజల వినోదం, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై కూడా కూటమి ప్రభుత్వం ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన వివరించారు.

చిన్న పిల్లల ఉల్లాసంగా ఆడుకునేందుకు, యువతకు వ్యాయామానికి, వృద్ధులకు విశ్రాంతికి ఈ పార్కు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా ఈ శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారికి కాంట్రాక్టర్లు గొంది నరసింహారావు, పొడపాటి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేకి వేదపండితుల ఆశీర్వాదాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూష, మున్సిపల్ డి ఈ గణపతి పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు కంద్రా మాల్యాద్రి ఉప్పుటూరి శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, మధిర మధు, వడ్లమూడి చెంచు నారాయణ, అత్తంటి శ్రీహరి నాయుడు, గడ్డం మాలకొండయ్య, మంచిరాజు మురళి, గుమ్మ శివ, ముచ్చు వేణు, చుండూరు శ్రీనివాసరావు, చక్క కేశవ కొత్తూరు వెంకట సుధాకర్ చీదెళ్ళ వేణు, ప్రవీణ్ మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

## యాభై మంది షిఫ్ట్ అపరేటర్లను తొలగించారు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 30)**

నియోజకవర్గంలోని శావల్యాపురం మండలం వేల్పూరుకు చెందిన తిరుపతిరావు మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ అపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తిరుపతిరావు వైసీపీ సానుభూతిపరుడు కావడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుపతిరావును విధులు నుంచి తొలగించారు. ఉద్యోగం లేదని తిరుపతిరావు భార్య తన పుట్టింటికి వెళ్లింది. ఉద్యోగం పోయి భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురైన తిరుపతిరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మాజీ ఎమ్మెల్యే వైసీపీ పీఏసీ సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు మృత దేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బొల్లా మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 50 మంది షిఫ్ట్ అపరేటర్లను తొలగించారన్నారు. షిఫ్ట్ అపరేటర్ తిరుపతిరావు ఆత్మహత్య ప్రభుత్వ ఆత్మహత్యగా భావించాలని, దీనికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బాధ్యత వహించాలని, బాదితుడి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని బొల్లా డిమాండ్ చేశారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com